
సాక్షి
భద్రాద్రి కొత్తగూడెం
ఆదివారం । 21 । మే । 2023



గాలి, వాన బీభత్సం
జిల్లాలోని పలుచోట్ల శనివారం రాత్రి ఈదురు గాలులతో పాటు వర్షం కురిసింది. దీంతో విద్యుత్ స్తంభాలు, చెట్లు విరిగిపడ్డాయి. 8లో



దొంగల బెడదతో బెంబేలు
వేసవి సెలవుల్లో పలువురు ఇళ్లకు తాళాలు వేసి వెళ్లగా, ఆ ఇళ్లే లక్ష్యంగా దొంగలు చోరీలకు పాల్పడుతున్నారు. 8లో

వాతావరణం
గరిష్టం / కనిష్టం 40° / 27°
జిల్లాలో ఆదివారం ఎండల ప్రభావం స్వల్పంగా తగ్గుతుంది. అక్కడక్కడా జల్లులు పడే అవకాశం ఉంది.

న్యూస్‌రీల్

రామయ్యకు వైభవంగా సువర్ణ తులసీ అర్చన


నిత్య కల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు

భద్రాచలంటౌన్: భద్రాచలం శ్రీసీతారామచంద్ర స్వామివారికి శనివారం సువర్ణ తులసీ అర్చన వైభవంగా నిర్వహించారు. తెల్లవారు జామున గర్భగుడిలో స్వామివారికి సుప్రభాత సేవ, సేవాకాలం, ఆరాధన తదితర పూజలు చేశారు. అనంతరం స్వామివారిని బేడా మండపంలో కొలువుదీర్చి విశ్వక్సేన పూజ, పుణ్యావాచనం జరిపించారు. అనంతరం స్వామివారికి కంకణధారణ, యజ్ఞోపవీతధారణ, అమ్మవారికి కంకణధారణ, యోక్త్రధారణ గావించి నిత్యకల్యాణ వేడుకను అర్చకులు శాస్త్రోక్తంగా నిర్వహించారు. వారాంతపు సెలవులు కావడంతో భక్తులు భారీగా హాజరై స్వామివారిని దర్శించుకుని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.

ప్రజలకు చేరువగా వైద్యసేవలు


దవాఖానాను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే హరిప్రియ

ఇల్లెందు: బస్తీ దవాఖానాల ఏర్పాటుతో వైద్య సేవలు ప్రజల ముంగిట్లో వచ్చాయని ఇల్లెందు ఎమ్మెల్యే హరిప్రియ అన్నారు. శనివారం ఇల్లెందులోని 3,12వ వార్డుల్లో ఏర్పాటు చేసిన బస్తీ దవాఖానాలను ఆమె ప్రారంభించారు. ఒక్కో దవాఖానాను రూ.13 లక్షలతో నిర్మించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రభుత్వ పథకాలు ప్రతీ ఇంటికి చేరుతున్నాయని పేర్కొన్నారు. డీఎంహెచ్‌ఓ జేవీఎల్ శిరీష మాట్లాడుతూ జిల్లాలో ఐదు దవాఖానాలు ప్రారంభయ్యాయని, మణుగూరుకు కూడా ఒక బస్తీ దవాఖానా మంజూరైందని అన్నారు. ఈ సభలో గ్రంథాలయ కమిటీ చైర్మన్ దిండిగాల రాజేందర్, మున్సిపల్ చైర్మన్ దమ్మాలపాటి వెంకటేశ్వరరావు, కమిషనర్ అంకుషావళి, కౌన్సిలర్లు సిలివేరు అనిత, కొక్కు నాగేశ్వరరావు. సయ్యద్ ఆజమ్, కడకంచి పద్మ, అంకెపాక నవీన్, జేకే శ్రీనివాస్, రవీందర్, డీఈ నరేష్‌రెడ్డి, ఏఈ శంకర్, బీఆర్‌ఎస్ అధికార ప్రతినిధి పులిగళ్ల మాధవరావు, రొంపేడు డాక్టర్ కవిత పాల్గొన్నారు.

కేటీపీఎస్‌లో నిలిచిన విద్యుదుత్పత్తి

పాల్వంచరూరల్: కేటీపీఎస్ 9వ యూనిట్ బాయిలర్‌లో శనివారం రాత్రి ఏర్పడిన సాంకేతిక లోపంతో విద్యుత్ ఉత్పత్తి నిలిచిపోయింది. వెంటనే గుర్తించిన ఇంజనీర్లు మరమ్మతు పనులు చేపట్టారు. ఆదివారం రాత్రి వరకు విద్యుత్ ఉత్పత్తిని పునరుద్ధరిస్తామని సీఈ ప్రభాకర్‌రావు తెలిపారు.

అడవిలో పుట్టి.. ఆలయ తలుపు తట్టి !

ధ్వజ స్తంభం, శిఖరం, కలశం, యంత్రం (విగ్రహాల కింద ఉంచేవి), మూర్తి (విగ్రహాలు).. ఇవి లేని ఆలయాలు అసంపూర్ణ కోవెలలని పండితులు, పురాణాలు చెబుతున్న మాట. ఇవన్నీ ఆలయాలకు అత్యంత అవసరం. వీటిలో ధ్వజస్తంభాలు మినహా మిగిలినవన్నీ లోహాలతో తయారు చేసేవే. ధ్వజ స్తంభాలకు పూర్వం రాయిని వినియోగించేవారు. ఇప్పుడు అంత ఎత్తయిన రాళ్లు అందుబాటులో లేక కలపతో తయారు చేస్తున్నారు. ఇవి అత్యధిక కాలం ధృఢంగా, మన్నికగా ఉండేందుకు నార వేప కలపనే ఎక్కువగా వినియోగిస్తున్నారు.
– ఇల్లెందురూరల్


ఇల్లెందు అడవుల్లోని నారవేప వృక్షాలు

కోవెలలో ధ్వజస్తంభాలకు ప్రత్యేకం నారవేప
- ఈ వృక్షాలకు జిల్లా అడవులు పెట్టింది పేరు
- ఇతర ప్రాంతాలకూ ఇక్కడి నుంచే తరలింపు
- టేకుకు ప్రత్యామ్నాయంగా ఈ కలపకు ప్రాధాన్యం

సండే స్పెషల్

ధ్వజస్తంభాలకు ప్రత్యేక స్థానం
గర్భగుడిలో దేవతామూర్తులతో సమానంగా భక్తులు ధ్వజ స్తంభాలకు ప్రాధాన్యం ఇస్తుంటారు. ఆలయ గర్భగుడికి ఎదురుగా శిఖరం ఎత్తుకు కాస్త తక్కువగా ధ్వజస్తంభాలను ప్రతిష్ఠిస్తుంటారు. వీటి తయారీకి నారవేప కలపను మాత్రమే వినియోగిస్తుంటారు. ఈ వృక్షాలకు జిల్లాలోని ఇల్లెందు, పాల్వంచ, భద్రాచలం ఏజెన్సీ అడవులు ప్రత్యేకం. ఎక్కువ కాలం ఎండకు ఎండినా, వానకు తడిసినా మన్నికగా ఉండే ఈ కలప జిల్లాలో మాత్రమే విరివిగా లభిస్తోంది. ముఖ్యంగా ఇల్లెందు ఏజెన్సీలో కనిపించే నారవేప వృక్షాలే ధ్వజస్తంభాలుగా ప్రతిష్ఠ చేయించుకుని పూజలందుకుంటున్నాయి. ప్రస్తుతం పలు గ్రామాల్లో నాభిశిల, ముత్యాలమ్మ, అంజనేయస్వామి ఆలయాల్లోనూ ధ్వజస్తంభ ప్రతిష్ఠ చేస్తున్నారు. పాత ఆలయాల్లో భిన్నమైన (విరిగిన) వాటి స్థానంలో కొత్తవాటిని ఏర్పాటు చేసేందుకు సన్నద్ధమవుతున్నారు. దీంతో ఇక్కడి నారవేప వృక్షాలకు గిరాకీ పెరిగింది.

ఇతర సామగ్రి తయారీలోనూ..
ధ్వజస్తంభాల తయారీకి మాత్రమే కాక ఇతర సామగ్రికి కూడా ప్రస్తుతం నారవేప కలపను అధికంగా వినియోగిస్తున్నారు. ప్రధానంగా దర్వాజాలు, తలుపులు, కిటికీల వంటి అవసరాలకు ఈ కలపకు అధిక ప్రాధాన్యం ఇస్తున్నారు. అంతేకాకుండా ప్రస్తుతం ఇల్లెందు ఏజెన్సీ ప్రాంతంలో టేకు వంటి విలువైన కలప అంతరించిపోవడం, నారవేప కలప విస్తారంగా ఉండడంతో స్మగ్లర్లు దీనిపైనే దృష్టి పెడుతున్నారు. భారీ వృక్షాలను అవసరమైన సైజులలో కట్ చేసి అక్రమంగా నిల్వ ఉంచి సమయానుకూలంగా తరలిస్తున్నారు. దీంతో అధిక మొత్తంలో కనిపించే నారవేప కలప ప్రస్తుతం ఇల్లెందు ఏజెన్సీలోనూ కనుమరుగయ్యే పరిస్థితులు కనిపిస్తున్నాయి. గత నాలుగేళ్లలో ఇల్లెందు, కొమరారం అటవీ రేంజ్ అధికారులు చేపట్టిన దాడుల్లో నారవేప కలపే అధికంగా దొరికింది.


ధ్వజస్తంభం కోసం తరలిస్తున్న కలప(ఫైల్)

అరుదైన వృక్షాలు ఇక్కడే..
రాష్ట్రంలో భద్రాచలం, ఇల్లెందు ఏజెన్సీల్లోనే ధ్వజ స్తంభాలకు ఉపయోగించే నారవేప వృక్షాలు దర్శనమిస్తుంటాయి. ఇతర జిల్లాల్లోనూ ఉన్నా.. ఇక్కడివి పురాతనమైనవి, మన్నిక కలవిగా గుర్తింపు పొందాయి. కొత్తగా నిర్మించే ఆలయాల్లోనూ ధ్వజస్తంభాలు తరాల పాటు చెక్కు చెదరకుండా నిలవాలంటే నారవేప కలపతో చేసినవే మంచివని పండితులు సైతం చెబుతుండడంతో ఇవి పవిత్రత చాటుకున్నాయి. దీంతో నారవేప కలపకు గిరాకీ పెరిగింది. ధ్వజస్తంభాలకు అవసరమైన నారవేప వృక్షాల కొనుగోలుకు జిల్లాతోపాటు మహబూబాబాద్, ఖమ్మం, జయశంకర్ భూపాలపల్లి, వరంగల్ తదితర ప్రాంతాల నుంచి అధిక సంఖ్యలో తరలివస్తుంటారు. నారవేప కలపను రహస్యంగా తరలిస్తూ ఇల్లెందు అటవీశాఖకు పట్టుబడిన సందర్భాలు కోకొల్లలు. అనుమతితో కొనుగోళ్ల కంటే పట్టుబడిన నారవేప కలపతోనే అటవీ శాఖకు అధిక ఆదాయం రావడం గమనార్హం.

నారవేప కలప రక్షణకు చర్యలు



ఆలయాల్లో.. ధ్వజస్తంభాల కోసం ప్రస్తుతం నారవేప వృక్షాలనే అధికంగా వినియోగిస్తున్నారు. ఈ వృక్షాల జీవిత కాలం, మన్నిక బాగుంటాయి. అందుకే వీటికి ప్రాధాన్యం ఇస్తుంటారు. నారవేప వృక్షాలను రెండు రకాలుగా కొనుగోలు చేయొచ్చు. దేవాదాయశాఖ అనుమతి తీసుకుని లేదంటే టింబర్ డిపోల్లో అయినా కొనవచ్చు. గృహ అవసరాలకు కూడా ప్రస్తుతం నారవేప కలపను అధికంగా వినియోగిస్తున్నారు. అయితే అక్రమంగా రవాణా చేయకుండా చూస్తున్నాం. ఈ వృక్షాల రక్షణకు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నాం.
– నాగేశ్వరరావు, ఎఫ్‌ఆర్‌ఓ, ఇల్లెందు రేంజ్

నకిలీ విత్తన రహిత జిల్లాగా తీర్చిదిద్దాలి

అదనపు కలెక్టర్ వెంకటేశ్వర్లు


కరపత్రాలు ఆవిష్కరిస్తున్న అదనపు కలెక్టర్ వెంకటేశ్వర్లు తదితరులు

సూపర్‌బజార్(కొత్తగూడెం): నకిలీ విత్తనాలు విక్రయించని జిల్లాగా తీర్చిదిద్దాలని అదనపు కలెక్టర్ కె. వెంకటేశ్వర్లు అన్నారు. ఐడీఓసీలో శనివారం వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో వానాకాలం సాగుకు సమాయత్తం, నకిలీ విత్తనాల నియంత్రణ, ఆయిల్ పామ్ సాగు తదితర అంశాలపై వ్యవసాయ, ఉద్యాన, సహకార, విత్తన, ఎరువుల వ్యాపారులతో సమన్వయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నకిలీ విత్తనాలు విక్రయించే వారిపై పీడీ యాక్ట్ నమోదు చేస్తామని హెచ్చరించారు. తెలంగాణలో ప్రస్తుతం ఉచిత విద్యుత్, రైతుబంధు, రైతుబీమా అమలుతో దేశంలోనే అధికంగా వరి పండిస్తున్న రాష్ట్రంగా నిలిచిందని చెప్పారు. తెలంగాణ సీడ్ కార్పొరేషన్ సరఫరా చేసిన విత్తనాలను మాత్రమే రైతులు వినియోగించాలని సూచించారు. లైసెన్స్‌డ్ వ్యాపారుల నుంచే కొనుగోలు చేసి, బిల్లులు భద్రపర్చాలని చెప్పారు. విత్తనాలు, ఎరువులు విక్రయాల నమోదు స్టాక్ రిజిస్టర్ నిర్వహించాలని సూచించారు. టాస్క్‌ఫోర్స్ టీంలు, వ్యవసాయాధికారులు ప్రతి దుకాణాన్ని తనిఖీ చేయాలని ఆదేశించారు. వరికి ప్రత్యామ్నాయంగా ఇతర పంటలు సాగు చేసేలా రైతులకు అవగాహన కల్పించాలని అన్నారు. మోతాదుకు మించి ఎరువులు వాడొద్దని, తద్వారా పంటలకు, భూసాంద్రతకు ప్రమాదమని హెచ్చరించారు. సమావేశంలో జిల్లా వ్యవసాయాధికారి కొర్స అభిమన్యుడు, జిల్లా ఉద్యాన శాఖాధికారి జినుగు మరియన్న, జిల్లా సహకార అధికారి వెంకటేశ్వర్లు, ఏడీఏలు లాల్‌చంద్, రవికుమార్, అఫ్జల్‌బేగం, సుధాకర్, కరుణశ్రీ, వాసవిరాణి పాల్గొన్నారు.

భద్రగిరిలో 24 నుంచి జ్యేష్ఠ మాసోత్సవాలు

భద్రాచలంఅర్బన్ : భద్రాచలం శ్రీ సీతారామచంద్ర స్వామివారి ఆలయంలో ఈనెల 24 నుంచి జ్యేష్ఠ మాసోత్సవాలు ప్రారంభం కానున్నాయి. శనివారం నుంచే జ్యేష్ఠమాసం ప్రారంభమైనప్పటికీ వైదిక కమిటీ ఇచ్చిన నివేదిక ప్రకారం ఉత్సవాలు నిర్వహిస్తారు. 24 పునర్వసు నక్షత్రం సందర్భంగా ఉత్సవ మూర్తులకు స్నపన తిరుమంజనం, రాత్రికి తిరువీధి సేవ, చుట్టుసేవ జరుపుతారు. 25న పుష్యమి నక్షత్రం సందర్భంగా రామయ్యకు పట్టాభిషేకం, 26న శుక్రవారం స్వామివారికి సంధ్యాహారతి, రాత్రికి చుట్టుసేవ ఉంటాయి. 29న నమ్మాళ్వార్ తిరునక్షత్రోత్సవాల్లో భాగంగా ఐదు రోజుల పాటు విశేష సేవాకాలం, భోగ నివేదన జరుపుతారు. 31న సర్వ ఏకాదశి సందర్భంగా స్వామివారికి తిరువీధి సేవ, చుట్టుసేవ జరుపుతారు. పవళింపు సేవ ఉండదు. అలాగే చిత్తా నక్షత్రం సందర్భంగా యాగశాలలో సుదర్శన హోమం నిర్వహిస్తారు. జూన్ 2న నమ్మాళ్వార్ తిరునక్షత్రం సందర్భంగా స్నపన తిరుమంజనం, సంధ్యాహారతి, స్వామివారికి, నమ్మాళ్వార్‌కు చుట్టు సేవ జరుపుతారు. 3న జ్యేష్ఠాభిషేకాన్ని పురస్కరించుకుని వాస్తు హోమం, అంకురార్పణ చేస్తారు. 4న స్వామివారికి 81కలశాలతో స్నపనం, హోమం, పూర్ణాహుతి, రాత్రికి తిరువీధి సేవ నిర్వహిస్తారు. ఈ సందర్భంగా నిత్య కల్యాణం రద్దు చేస్తారు. 14న సర్వ ఏకాదశి సందర్భంగా అంతరాలయంలో లక్ష కుంకుమార్చన, విశేష భోగ నివేదన ఉంటాయి. ఈ వేడుకల్లో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొనాలని ఆలయ ఈఓ ఎల్.రమాదేవి కోరారు.

జాబ్‌మేళాకు అనూహ్య స్పందన



మాట్లాడుతున్న ఉపాధికల్పన అధికారి విజేత

కొత్తగూడెంటౌన్: రుద్రంపూర్ ప్రభుత్వ ఐటీఐలో శనివారం నిర్వహించిన జాబ్‌మేళాకు విశేష స్పందన లభించిందని జిల్లా ఉపాధి కల్పనాధికారి వేల్పుల విజేత తెలిపారు. సుస్థిర ఇన్‌ఫ్రా ఆధ్వర్యంలో పదో తరగతి, ఇంటర్, డిగ్రీ, డిప్లొమా, ఐటీఐ విద్యార్హతతో మార్కెటింగ్ ఎగ్జిక్యూటివ్ పోస్టులు, డిగ్రీ, బీటెక్, ఎంబీఏ, అర్హతతో మార్కెటింగ్ మేనేజర్లు 20, ఇంటర్, డిగ్రీ, ఎంబీఏ అర్హతతో టెలికాలర్స్ -10 ఉద్యోగాల కోసం 168 మంది అభ్యర్థులు రాగా మార్కెటింగ్ మేనేజర్లుగా నలుగురు, మార్కెటింగ్ ఎగ్జిక్యూటివ్‌లుగా-40 మంది, టెలికాలర్స్-10 మంది ఎంపికయ్యారని వివరించారు. యువత ఇలాంటి జాబ్ మేళాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఉద్యోగాలకు ఎంపికైన వారికి నియామకపత్రాలు అందజేశారు. కార్యక్రమంలో ఐటీఐ టీఓ శోభన్‌బాబు, సుస్థిర కంపెనీ హెచ్‌ఆర్ దొరబాబు, కార్యాలయ సిబ్బంది బుచ్చిబాబు, యాకయ్య, జయమ్మ, రాజు, అంబేద్కర్ పాల్గొన్నారు.

ఔట్ రిచ్ వర్కర్ పోస్టుకు దరఖాస్తుల ఆహ్వానం

కొత్తగూడెంటౌన్: మహిళా శిశు, వికలాంగుల వయోవృద్ధుల శాఖలో (జిల్లా సంక్షేమశాఖ)లో కాంట్రాక్ట్ పద్ధతిలో ఔట్ రిచ్ వర్కర్ పోస్టు భర్తీకి పురుష అభ్యర్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు జిల్లా సంక్షేమశాఖ అధికారిణి ఎం.సబిత శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 20న దరఖాస్తుల ప్రక్రియ ప్రారంభమైందని, 27వ తేదీ వరకు దరఖాస్తు చేసుకోవాలని కోరారు.

సీఎం కప్ పోటీలకు ఏర్పాట్లు

యువజన, క్రీడల శాఖ అధికారి సీతారాం

కొత్తగూడెంటౌన్: జిల్లా స్థాయి సీఎం కప్ పోటీలకు ఏర్పాట్లు పూర్తి చేసినట్లు జిల్లా యువజన, క్రీడల శాఖ అధికారి టి.సీతారాం శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లా క్రీడా ప్రాధికార సంస్థ, లెక్టర్ ఆదేశాల మేరకు సీఎం కప్ టోర్నమెంట్ జిల్లా స్థాయిలో ఈ నెల 24న కొత్తగూడెం ప్రకాశం స్టేడియంలో నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. ప్రకాశం స్టేడియంలో ఉదయం 8 గంటలకు లాన్ టెన్నిస్, టేబుల్ టెన్నిస్, షూటింగ్, జిమ్నాస్టిక్, ఆర్చరీ, హాకీ, వెయిట్ లిఫ్టింగ్ పోటీలకు ఎంపికలు ఉంటాయని వివరించారు.

కాలం ముందుకు 'సాగే'నా?

- జిల్లాలో విభిన్న వాతావరణ పరిస్థితులు
- వరదలతో వానాకాలం పంట సాగు జాప్యం


వరి నాటు వేస్తున్న కూలీలు(ఫైల్)

బూర్గంపాడు: యాసంగి పంట కాలం నెల రోజులు ముందుకు జరపాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. అకాల వర్షాలు, వడగండ్ల వానలతో మూడేళ్లుగా యాసంగి పంటలకు తీవ్ర నష్టం వాటిల్లుతోంది. ముఖ్యంగా వరి, మొక్కజొన్న పంటలు అకాల వర్షాలతో దెబ్బతింటున్నాయి. ఏప్రిల్, మే నెలల్లో పంటలు చేతికొస్తున్న తరుణంలో అకాల వర్షాలు పంటలను నష్టపరుస్తున్నాయి. ఈ ఏడాది ఏప్రిల్ నెలాఖరు నుంచి మేలో కూడా కురుస్తున్న అకాల వర్షాలతో కల్లాలు, కొనుగోలు కేంద్రాల్లోని ధాన్యం తడిసిపోయింది. ఈ పరిస్థితుల్లో రైతులు ధాన్యం అమ్ముకునేందుకు నానా ఇబ్బందులు పడుతున్నారు. మిల్లర్లు ధాన్యం కొనుగోలుకు కొర్రీలు పెడుతున్నారు. ఈ పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని సీఎం కేసీఆర్ ఇటీవల నిర్వహించిన మంత్రివర్గ భేటీలో వానాకాలం, యాసంగి పంటలను ముందుకు జరపాలని నిర్ణయించారు.

జిల్లాలో అనుకూలించేనా..
జిల్లాలో ఎక్కువగా వర్షాధారిత పంటలనే సాగుచేస్తారు. వర్షాలు కురిస్తేనే పత్తి, కూరగాయలు, అపరాల సాగు ప్రారంభమవుతుంది. ఈ పంటలు జూలై, ఆగస్టు నెలల్లో వేస్తారు. గోదావరి వరదలు, ప్రతికూల వాతావరణ పరిస్థితుల్లో రైతులు వానాకాలం పంటలనే రెండుసార్లు సాగుచేయాల్సి వస్తోంది. జిల్లాలో వరి కూడా ఎక్కువగా వర్షాధారితంగానే సాగవుతోంది. సకాలంలో వర్షాలు కురిసి చెరువులు నిండితినే ఈ పంట వేసేది. జిల్లాలో జూలై, ఆగస్టు, సెప్టెంబర్ నెలల్లో రైతులు వరిసాగు చేస్తున్నారు. విద్యుత్ మోటార్లు, చెరువులు, కుంటల కింద రెండునెలల పాటు ఈ పంట సాగవుతుంది. సాగునీటి వనరులు, కూలీల లభ్యత కూడా వరి సాగులో కీలకం. వానాకాలం సాగుచేసిన పంటలు డిసెంబర్‌లో రైతుల చేతికందుతాయి. యాసంగిలో తిరిగి వరి సాగు చేయాలంటే డిసెంబర్, జనవరి నెలల్లో వరినార్లు పోసుకుని జనవరి నెలాఖరు వరకు నాట్లు వేస్తారు. జనవరిలో సాగుచేసిన వరి ఏప్రిల్, మే నెలల్లో రైతుల చేతికందుతుంది. మూడేళ్లుగా మే నెలలో అకాల వర్షాలు రైతులను నట్టేట ముంచుతున్నాయి.

ముందుకు జరిపితే దిగుబడిపై ప్రభావం..
పంటల సాగును నెల రోజులు ముందుకు జరిపితే దిగుబడిపై వాతావరణ పరిస్థితులు ప్రభావం చూపుతాయని రైతులంటున్నారు. డిసెంబర్‌లో వరిసాగు చేస్తే విపరీతమైన చలితో పైరు తొందరగా పచ్చబడదని, దుబ్బు చేయదని చెబుతున్నారు. సంక్రాంతి తర్వాత ఎండ తీవ్రత కొంతమేర పెరిగితేనే పైరు ఆరోగ్యంగా ఉంటుందని, ముందుగా వరివేస్తే దిగుబడులు తగ్గతాయని అంటున్నారు. వానాకాలం పంటను కూడా నెల రోజులు ముందుకు జరిపితే అక్టోబర్, నవంబర్‌లో వరికోతలు వస్తాయి. ఆ సమయంలో కూడా తరచుగా వర్షాలు కురుస్తూనే ఉంటాయి. దీంతో పంటల సాగుపై ప్రభావం చూపనుంది. ఈ పరిస్థితుల్లో పంటల సాగును ముందుకు జరపడం కంటే తక్కువ కాల వ్యవధిలో చేతికొచ్చే వంగడాలను అభివృద్ధి చేయాలని ప్రభుత్వాన్ని రైతులు కోరుతున్నారు.

వాతావరణం ఆధారంగానే
వాతావరణం ఆధారంగానే పంటల సాగు చేపడతాం. వర్షాలు సకాలంలో కురిస్తే సాగు సకాలంలో మొదలవుతుంది. గోదావరి వరదలు కూడా వానాకాలం పంటల సాగు జాప్యానికి కారణమవుతోంది. జిల్లాలో జూన్ నుంచి అక్టోబర్ వరకు వర్షాలు కురుస్తున్నాయి. నవంబర్ నుంచి జనవరి వరకు చలి తీవ్రత పెరుగుతుంది. ఈ పరిస్థితుల్లో ముందస్తు పంటల సాగు ఏవిధంగా ఉంటుందో చూడాలి.
– మారం శ్రీనివాసరెడ్డి, రైతు, సంజీవరెడ్డిపాలెం

ప్రభుత్వ ఆదేశాల మేరకు చర్యలు
ప్రభుత్వ ఆదేశాల మేరకు పంటల సాగుకు చర్యలు తీసుకుంటాం. నెలరోజుల పాటు పంటల సాగును ముందుకు జరపాలని ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. దీనిపై స్పష్టమైన ఆదేశాలు, మార్గదర్శకాలు రాలేదు. ప్రభుత్వ ఆదేశాల మేరకు రైతులను చైతన్యపరిచేలా చర్యలు చేపడతాం.
– బి.తాతారావు, ఏడీఏ, మణుగూరు

పాత పనులకే కొత్త మెరుగులు!

- 'గూడెం' మున్సిపాలిటీలో యథేచ్ఛగా నిధులు పక్కదారి
- ప్రస్తుతం రూ.30 కోట్లకు టెండర్ ప్రక్రియ
- రోడ్లు, డ్రెయినేజీల నిర్మాణానికి ప్రణాళిక
- ఈసారైనా సక్రమంగా వినియోగించాలని పురప్రజల వేడుకోలు


కూలీలైన్ వెళ్లే మార్గంలో అసంపూర్తిగా వదిలేసిన రోడ్డు

కొత్తగూడెంఅర్బన్: జిల్లాలో ఏ గ్రేడ్ మున్సిపాలిటీగా ఉన్న కొత్తగూడెం అభివృద్ధికి ఏటా వివిధ పథకాల నిధులు విడుదలవుతున్నా సక్రమంగా వినియోగించడంలేదనే ఆరోపణలు వ్యక్తమవుతున్నాయి. కొందరు అవినీతిపరుల వల్ల అభివృద్ధికి ఆటంకాలు ఏర్పడుతున్నాయి. పనులు చేయకపోయినా చేసినట్లు చూపించి, పాత వాటికే కొత్త మెరుగులు దిద్ది నిధులు జేబులు నింపుకుంటున్నారనే ఆరోపణలు వెల్లువెత్తున్నాయి. రాష్ట్ర ముఖ్యమంత్రి కేసీఆర్ కొత్తగూడెం మున్సిపాలిటీ అభివృద్ధికి రూ.115 కోట్లు కేటాయించగా, రూ.70 కోట్లకు ప్రొసిడింగ్స్ వచ్చాయి. అందులో రూ.30 కోట్లకు టెండర్ ప్రక్రియ కొనసాగుతోంది. మరో రూ.40 కోట్లకు సాంకేతికపరమైన ఆమోదం రావాల్సి ఉంది. ప్రస్తుతం కొనసాగుతున్న రూ.30 కోట్ల నిధులతో ప్రధానంగా రోడ్లు, డ్రెయినేజీలు నిర్మించేందుకు మున్సిపల్ అధికారులు ప్రణాళికలు చేస్తున్నట్లు తెలుస్తోంది. కొత్తగూడెం మున్సిపాలిటీ పరిధిలోని 36 వార్డుల్లో కొన్ని ప్రధాన రోడ్లు, డ్రెయినేజీలు పెండింగ్‌లో ఉండగా, వార్డులన్నింటిలో 80 శాతం వరకు రోడ్లు, డ్రెయినేజీల వ్యవస్థ ఉంది. మరో 20 శాతం వరకు నిర్మించాల్సిఉంది. రూ.30 కోట్లతో ఇప్పటికే ఉన్న రోడ్లు, డ్రెయినేజీలకు మెరుగులు దిద్దకుండా, లేనిచోట నిర్మించాలని, నిధులు దుర్వినియోగం కాకుండా మున్సిపల్ అధికారులతో పాటుగా క్వాలిటీ కంట్రోల్ పర్యవేక్షణ తప్పనిసరిగా ఉండాల్సిన అవసరముంది.

మున్సిపాలిటీలో కొన్ని అసంపూర్తి నిర్మాణాలు..
- మున్సిపాలిటీలో ఏళ్ల తరబడి అసంపూర్తిగా ఉన్న నిర్మాణాలను పూర్తి చేయకుండా అధికారులు నిర్లక్ష్యం వహిస్తున్నారు.
- గొల్లగూడెం నుంచి ఎదురుగడ్డకు వెళ్లే మార్గంలో రోడ్డు నిర్మాణం, డ్రెయినేజీ నిర్మాణం మున్సిపాలిటీ, పంచాయతీ వారికి మధ్య సమన్వయం లేక నిలిచిపోయింది. దీంతో రోడ్డుపై రాళ్లు తేలి, వర్షపు నీరు నిలిచి రాకపోకలకు అంతరాయం కలుగుతోంది.
- రైతుబజార్ ఏరియా నుంచి కూలీలైన్‌కు వెళ్లే మార్గంలోని రోడ్డును కూడా అసంపూర్తిగా నిర్మించి వదిలివేశారు. పాత కొత్తగూడెంలో అర్బన్‌హెల్త్ సెంటర్ రోడ్డు కూడా అధ్వానంగా మారింది.
- సెవెన్‌హిల్స్ నుంచి సింగరేణి ప్రధాన ఆస్పత్రి వరకు ఉన్న సీసీ రోడ్డు బాగానే ఉంది. అయినా నిధులు ల్యాప్స్ అవుతున్నాయని మున్సిపల్ అధికారులు సీసీ రోడ్డుపైనే బీటీ రోడ్డు వేసి, నిధులు వృథా చేశారనే ఆరోపణలున్నాయి. ఈ రోడ్డులో సెంట్రల్ లైటింగ్ ఏర్పాటుకు ప్రతిపాదనలు ఉండగా, ఆచరణకు నోచుకోవడంలేదు.
- రామవరంలోని కొన్ని వార్డులు, పాతకొత్తగూడెం, బూడిదగడ్డ, గాజులరాజంబస్తీ, గొల్లగూడెం, మేదరబస్తీ వంటి ప్రాంతాల్లో వర్షం పడితే వర్షపు నీరు నిలిచిపోయి ప్రజలు ఇబ్బందులు పడే పరిస్థితులున్నాయి. ఆయా ప్రాంతాలలో కల్వర్టులు, డ్రెయినేజీల నిర్మాణాలు చేపట్టి నీరు నిల్వకుండా మున్సిపల్ అధికారులు నిర్మాణాలు చేపట్టాల్సిన అవసరముంది.

టెండర్ ప్రక్రియ కొనసాగుతోంది..



రాష్ట్ర ముఖ్యమంత్రి కేసీఆర్ ప్రకటించిన నిధులకు సంబంధించి కొత్తగూడెంలో టెండర్ ప్రక్రియ కొనసాగుతోంది. టెండర్ ప్రక్రియ పూర్తయిన తర్వాత పనులు ప్రారంభమవుతాయి. పనుల్లో నాణ్యత ఉండే విధంగా చర్యలు తీసుకుంటాం. నాణ్యత లేని పనులపై చర్యలు తప్పక ఉంటాయి.
– జి.రఘు, మున్సిపల్ కమిషనర్, కొత్తగూడెం

దొంగల బెడదతో బెంబేలు

తాళం వేసి ఉన్న ఇళ్లే లక్ష్యంగా చోరీలు

- వేసవి సెలవుల్లో ఊర్లకు వెళ్లడంతో దొంగల హల్‌చల్
- జిల్లా వ్యాప్తంగా మూడేళ్లలో 1,017 చోరీ కేసులు
- ఇప్పటివరకు పోలీసులు ఛేదించినవి 665



నిందితులను చూపుతున్న పోలీసులు (ఫైల్)

కొత్తగూడెంటౌన్: వేసవి సెలవులు కావడంతో ఎక్కువ మంది ఇళ్లకు తాళం వేసి బంధువుల ఇళ్లకు, విహార, తీర్థయాత్రలకు వెళుతుంటారు. ఇదే అదునుగా దొంగలు చోరకళ ప్రదర్శిస్తున్నారు. జిల్లాలో గత మూడేళ్లలో ఇలాంటి ఇళ్లలో 1,017 చోరీ కేసులు నమోదయ్యాయి. ఇందులో 665 కేసులను పోలీసులు ఛేదించారు. మొత్తం రూ.9,25,75,628 విలువైన నగలు, నగదు అపహరణకు గురికాగా రూ.4,02,94,561 మేర పోలీసులు స్వాధీనం చేసుకుని బాధితులకు అందజేశారు.

చోరీలు.. అడ్డొస్తే దాడులు

తాళం వేసి ఉన్న ఇళ్లు, దుకాణాలే లక్ష్యంగా చోరీలకు పాల్పడుతున్నారు. ముందుగా రెక్కీ నిర్వహించి, ఇంట్లో ఎవరూ లేరని నిర్ధారించుకున్నాక చోరీలకు పాల్పడుతున్నారు. పోలీసులు తనిఖీలు చేపట్టినా, పెట్రోలింగ్ నిర్వహించినా దొంగతనాలను అరికట్టలేకపోతున్నారనే విమర్శలు వినిపిస్తున్నాయి. జల్సాలకు అలవాటుపడ్డ కొందరు చోరీలకు పాల్పడటమే వృత్తిగా చేస్తున్నారని, వీరిలో కొందరు మహిళలు కూడా ఉన్నట్లు తెలుస్తోంది. కొన్నిచోట్ల పగటి వేళల్లో కూడా చోరీలు జరుగుతున్నాయి. దుకాణాలు, రైల్వే స్టేషన్లు, ఆర్టీసీ బస్టాండ్ సెంటర్ తదితర రద్దీ ప్రదేశాల్లో విలువైన వస్తువులు, బంగారం, వాహనాలు, నగదు దొంగిలిస్తున్నారు. అడ్డకోబోయిన వారిని గాయపరుస్తున్నారు. మార్కెట్లలో దొంగ బంగారం విక్రయించే ముఠాలు ఎక్కువగానే ఉన్నట్లు ఆరోపణలు వస్తున్నాయి. ఇక్కడి వారితోపాటు కొందరు ఇతర జిల్లాలు, ఇతర రాష్ట్రాల నుంచి వచ్చి చోరీలు చేస్తున్నారు. ఒంటరి మహిళలను, వృద్ధులను లక్ష్యంగా చేసుకుని చైన్ స్నాచింగ్‌లకు పాల్పడుతున్నారు. పాత నేరస్తుల తోపాటు అనుమానిత వ్యక్తులపై నిఘా పెట్టకపోవడంవల్లే చోరీలు జరుగుతున్నాయనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి. గతేడాది సెప్టెంబర్ 30న ఎస్పీ కార్యాలయం సమీపంలోని త్రీటౌన్ పరిధి గాజుల రాజంబస్తీలో సింగరేణి కార్మికుడి ఇంట్లో దొంగలు పడి 6 తులాల బంగారం, నగదు దొంగిలించారు.

పోలీసులు ఛేదించిన కొన్ని కేసులు

- తరచూ కొత్తగూడెంలో చోరీలో చేస్తున్న నల్లగొండ జిల్లాకు చెందిన వ్యక్తి 2022, జనవరి 18న పోలీసులకు పట్టుబడ్డాడు. బంగారు ఆభరణాలు స్వాతి హారం, రెండు నెక్లెస్‌లు, 4 జతల చెవిదిద్దులు, నల్లపూసల హారం, మూడు ఉంగరాలు, గాజు, చెవిమాటీలు చోరీ చేసి రూ.1,30,000కు విక్రయించినట్లు విచారణలో తేలింది.
- 2022, ఏప్రిల్ 22న కొత్తగూడెం బస్టాండ్ సెంటర్‌లో పోలీసులు ఇద్దరు అనుమానిత వ్యక్తులను అదుపులోకి తీసుకుని విచారించారు. కొత్తగూడెంలోని కూలీలైన్‌కు చెందిన వారి వద్ద 178 గ్రాముల బంగారు ఆభరణాలు(చెవి కమ్మలు, చైన్‌లు ఉంగరాలు), 110 గ్రాముల వెండి(పట్టీలు)ని పోలీసులు స్వాధీనం చేసుకున్నారు.
- 2022, జూన్ 25న కొత్తగూడెంలోని బంగారం షాపులో చోరీకి పాల్పడిన ఐదుగురు మహిళలను అరెస్ట్ చేసి రూ.60 వేల విలువైన చెవిదిద్దులను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు..
- సింగరేణి ప్రాంతాల్లో రాగి దొంగతనాలకు పాల్పడుతున్న 21 మందిని కొత్తగూడెం వన్, టూ, త్రీటౌన్ ప్రాంతాలకు చెందిన నిందితులను గత ఫిబ్రవరి 9న పోలీసులు పట్టుకున్నారు. 13.5 క్వింటాళ్ల రాగిని స్వాధీనం చేసుకున్నారు.

పెట్రోలింగ్ నిర్వహిస్తున్నాం



వేసవి సెలవులు కావడంతో చోరీలు జరిగే అవకాశం ఎక్కువగా ఉంటుంది. కొత్తగూడెం సబ్ డివిజన్ పరిధిలో అన్ని ప్రాంతాల్లో పెట్రోలింగ్ నిర్వహిస్తున్నాం. చోరీలను అరికడుతున్నాం. ఇళ్లకు తాళం వేసి ఊర్లెళ్లేవారు తప్పకుండా పక్కింటి వారికి, పోలీసులకు సమాచారం ఇవ్వాలి. దీంతో రాత్రి పూట ఆయా గల్లీల్లో పెట్రోలింగ్ పెంచుతాం. తద్వారా దొంగల బారిన పడకుండా చర్యలు తీసుకుంటున్నాం. దొంగతనాలకు పాల్పడేందుకు దొంగలు వస్తే వారిని ఎలా ఎదుర్కోవాలనే అంశాలపై ప్రజలకు అవగాహనను కల్పిస్తున్నాం.

–అబ్దుల్ రెహమాన్, కొత్తగూడెం డీఎస్పీ

గాలివానకు కూలిన ఇళ్లు, స్తంభాలు



చీకట్లు అలుముకున్న భద్రాచలం ప్రభుత్వాస్పత్రి



పాల్వంచ రూరల్: పట్టణంలో కూలిన పిట్టగోడ



టేకులపల్లి : కిష్టారంలో ఆటోపై విరిగిపడ్డ చెట్టు

దుమ్ముగూడెం: జిల్లాలో శుక్రవారం అర్ధరాత్రి, శనివారం రాత్రి పలుచోట్ల గాలివాన బీభత్సం సృష్టించింది. ఈదురు గాలులకు చెట్లు, విద్యుత్ స్తంభాలు కూలిపోయాయి. దుమ్ముగూడెం మండలం కోయనర్సాపురంలో పెడకం కామయ్య, పాయం కాంతమ్మలకు చెందిన ఇళ్లపై ఉన్న రేకులు కూలిపోయాయి. దీంతో బాధితులు తెల్లవార్లు ఇంటి బయటనే నిద్రించారు.

విద్యుత్ ఉపకరణాలు దగ్ధం

దమ్మపేట: మండల పరిధిలోని పట్వారిగూడెం గ్రామంలో శుక్రవారం అర్ధరాత్రి పిడుగుపడి పలువురి ఇళ్లలో టీవీ, ఫ్యాన్, ఫ్రిజ్ తదితర విద్యుత్ ఉపకరణాలు కాలిపోయాయి.

విరిగిపడిన విద్యుత్ స్తంభాలు

టేకులపల్లి: మండలంలో శనివారం వడగళ్ల వాన పడింది. పలు గ్రామాల్లో రహదారుల వద్ద భారీ వృక్షాలు, విద్యుత్ స్తంభాలు విరిగిపడ్డాయి. మద్దిరాల తండాకు చెందిన బాదావత్ శంకర్ ఇంటిపై 11 కేవీ విద్యుత్ లైన్ స్తంభం విరిగిపడింది. పలు గ్రామాల్లో విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. కిష్టారం గ్రామంలో చెట్టు విరిగి ఆటోపై పడింది.

కూలిన కిరాణం షాపు పిట్ట గోడ

పాల్వంచరూరల్: పాల్వంచలో భారీ గాలులకు శ్రీలక్ష్మీబాలాజీ కిరాణం దుకాణంపై నిర్మించిన పిట్టగోడ కూలింది. దీంతో షాపు రేకులు, విద్యుత్ వైర్లు ధ్వంసమయ్యాయి. పలు చోట్లుచెట్ల కొమ్మలు విరిగి పడటంతో విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. పట్టణంలో మూడు విద్యుత్ స్తంభాలు విరిగిపడ్డాయి.

వడగండ్ల వాన

ఇల్లెందురూరల్: పలు గ్రామాల్లో సుమారు గంటపాటు వడగండ్ల వాన కురిసింది. చల్లసముద్రం, కొమరారం మొక్కజొన్న కొనుగోలు కేంద్రాలకు తరలించిన మొక్కజొన్న తడవకుండా రైతులు పట్టాలు కప్పుకున్నారు. కొన్నిచోట్ల మొక్కజొన్నలు తడిసిపోయాయని రైతులు పేర్కొన్నారు.

అంధకారంలో ఆస్పత్రి

భద్రాచలంఅర్బన్: గాలివానతో విద్యుత్ సరఫరా నిలిచి భద్రాచలం ఏరియా ఆస్పత్రి సుమారు 50 నిమిషాలపాటు అంధకారంలో ఉండిపోయింది. ఆస్పత్రిలో జనరేటర్ ఉన్నప్పటికీ సాంకేతిక లోపంతో పనిచేయనట్లు తెలుస్తోంది. విద్యుత్ లేకపోవడంతో చికిత్స పొందుతున్న పలువురు ఇబ్బంది పడ్డారు. ఈ విషయమై ఆస్పత్రి సూపరింటెండెంట్ రామకృష్ణను వివరణ కోరగా.. జనరేటర్‌లో తాత్కాలిక సమస్య ఏర్పడగా టెక్నీషియన్లు సరిచేస్తున్నారని తెలిపారు.

ధాన్యం కొనుగోలు చేయాలి



రైతులతో మాట్లాడుతున్న డీసీఓ వెంకటేశ్వర్లు

ములకలపల్లి: జాప్యం చేయకుండా ధాన్యం కొనుగోలు చేయాలని కోరుతూ తెలంగాణా రైతు సంఘం ఆధ్వర్యంలో మార్కెట్‌యార్డు వద్ద పాల్వంచ-మండలపల్లి రహదారిపై శనివారం రాస్తారోకో నిర్వహించారు. ఈ సందర్భంగా సంఘం మండల అధ్యక్షుడు ఊకంటి రవికుమార్ మాట్లాడుతూ ధాన్యం కేంద్రాలకు చేర్చి నెలలు గడుస్తున్నా కొనడంలేదని ఆవేదన వ్యక్తం చేశారు. సమాచారం తెలుకున్న డిస్ట్రిక్ కో ఆపరేటివ్ ఆఫీసర్ (డీసీఓ) వెంకటేశ్వర్లు ఆందోళన వద్దకు చేరుకుని రైతులతో మాట్లాడారు. నిర్దేశిత తేమశాతం ఉండేలా చూసుకోవాలని, వారం రోజుల్లో పూర్తిస్థాయిలో ధాన్యం తరలిస్తామని హామీ ఇవ్వడంతో ఆందోళన విరమించారు. నాయకులు గడ్డం వెంకటేశ్వర్లు, ఊకంటి రాంబాబు, నిమ్మల మధు, చనగాని వినోద్, పశువుల సూర్య, ముదిగొండ ప్రశాంత్ పాల్గొన్నారు.

మద్యం బాటిళ్లు చోరీ

బూర్గంపాడు: మండల పరిధిలోని సారపాకలోని సాయిభవాని లిక్కర్ షాపులో చోరీ జరిగింది. శుక్రవారం రాత్రి దొంగలు వైన్ షాపులో చొరబడి 36 కేసుల లిక్కర్‌ను ఎత్తుకెళ్లారు. శనివారం ఉదయం వైన్‌షాప్ నిర్వాహకులు షాపు తెరిచేందుకు వచ్చేసరికి షట్టర్ తాళాలు పగలగొట్టి ఉన్నాయి. లోపలికి వెళ్లి చూడగా మద్యం బాటిళ్లు చోరీకి గురైనట్లు గుర్తించారు. సుమారు రూ.2.80 లక్షల విలువైన మద్యం బాటిళ్లు చోరీకి గురైనట్లు నిర్వాహకులు తెలిపారు. పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని వివరాలు సేకరించారు. దర్యాప్తు ప్రారంభించారు.

ఎకరాకు రూ.30 లక్షలు చెల్లించాలి



రాస్తారోకో చేస్తున్న నిర్వాసితులు

దుమ్ముగూడెం: ఎకరానికి రూ. 30 లక్షల చొప్పున పరిహారం చెల్లించాలని లేదా భూమికి బదులు భూమి ఇవ్వాలని సీతమ్మ సాగర్ ప్రాజెక్టు భూ నిర్వాసితులు డిమాండ్ చేశారు. సీతానగరం సెంటర్‌లో శనివారం రాస్తారోకో నిర్వహించారు. ప్రభుత్వం స్పష్టమైన హామీ ఇచ్చేవరకూ భూసేకరణ పనులు నిలిపి వేయాలని కోరారు. ఈ సందర్భంగా సీతమ్మ సాగర్ ప్రాజెక్టు భూ నిర్వాసితుల సంఘం చర్ల, దుమ్ముగూడెం మండలాల అధ్యక్షుడు కొమరం దామోదర రావు మాట్లాడుతూ రెండు సార్లు భూసేకరణ వల్ల భూములు కోల్పోయి కుటుంబాలు రోడ్డున పడే పరిస్థితి దాపురించిందని పేర్కొన్నారు. ముందుచూపు లేకుండా పనులు చేపట్టడం వల్ల రానున్న వర్షాకాలంలో గ్రామాలు ముంపునకు గురయ్యే అవకాశం ఉందని అన్నారు. లోతట్టు ప్రాంతాల రక్షణకు కరకట్ట నిర్మించాలని, మిగిలిన భూములకు సాగునీరు అందించాలని కోరారు. ఈ కార్యక్రమంలో సాగి రామచంద్ర రాజు, నీలం వర్మ, సీతాపతి రాజు, సాగి జగన్నాథ్ రాజు, తుష్టికామరాజు, పూనెం అర్జున్, తెల్లం లక్ష్మీ నారాయణ, దేవరపల్లి సర్పంచ్ సమ్మయ్య, తెల్లం హరికృష్ణ, ఆకుల లక్ష్మీపతిరావు, సీపీఐ (ఎంఎల్) ప్రజాపంథ నాయకులు దాసరి సాయన్న , కొండా చరణ్, మిడియం వీరయ్య, గొరారపు సాంబశివ రావు, వాగె చలపతిరావు, భద్రయ్య, తెల్లం వెంకటేశ్వర్లు, కారం నరసింహారావు పాల్గొన్నారు.

ప్రతీ ఇంట్లో ఇంకుడు గుంత ఉండాలి

జెడ్పీ సీఈఓ విద్యాలత



సిబ్బందితో మాట్లాడుతున్న జెడ్పీ సీఈఓ విద్యాలత

ఇల్లెందురూరల్: ప్రతీ ఇంట్లో ఇంకుడుగుంత ఉండేలా పంచాయతీ అధికారులు ప్రజలను ప్రోత్సహించాలని జెడ్పీ సీఈఓ విద్యాలత సూచించారు. శనివారం ఆమె మండలంలోని సుదిమళ్ల గ్రామపంచాయతీలోని ఇళ్లలో నిర్మించిన ఇంకుడుగుంతలను పరిశీలించి మాట్లాడారు. అనంతరం గ్రామపంచాయతీ నర్సరీని, అవెన్యూ ప్లాంటేషన్‌ను తనిఖీ చేశారు. సర్పంచ్ కల్తి పద్మ, ఎంపీడీఓ బాలరాజు, పంచాయతీ కార్యదర్శి నాగమణి తదితరులు పాల్గొన్నారు.

● భారీ వృక్షాల నరికివేత



రోడ్డు పక్కన కలప దుంగలు

సుజాతనగర్: రోడ్డు విస్తరణలో భారీ వృక్షాలు నరికివేస్తున్నారు. కొత్తగూడెం-సత్తుపల్లి రైల్వే లైన్ నిర్మాణంలో భాగంగా రాష్ట్రీయ రహదారి విస్తరణ పనులు చేపడుతున్నారు. ఈ క్రమంలో ఆర్వోబీ వంతెన తోపాటు పోచమ్మతల్లి ఆలయం నుంచి సుజాతనగర్ వరకు 4 కిలోమీటర్ల మేర రహదారిని 4 లేన్లుగా విస్తరిస్తున్నారు. విస్తరణకు అడ్డంగా ఉన్న వృక్షాలను తొలగిస్తున్నారు. రెండేళ్ల క్రితం హరితహారం కార్యక్రమంలో భాగంగా అవెన్యూ ప్లాంటేషన్‌లో నాటిన మొక్కలను కూడా నరికివేస్తున్నారు. దీంతో ఇప్పటివరకు పచ్చదనంతో ఉన్న రహదారి కళావిహీనంగా మారింది. కాగా చెట్లను తొలగించకుండా కేంద్ర ప్రభుత్వ నిబంధనల ప్రకారం ట్రాన్స్ ప్లాంటేషన్ చేయాలని పర్యావరణ ప్రేమికులు కోరుతున్నారు.

పాముకాటుతో బాలుడు మృతి

టేకులపల్లి: పాముకాటుతో బాలుడు మృతి చెందిన సంఘటన శనివారం చోటుచేసుకుంది. కుటుంబ సభ్యులు, స్థానికుల కథనం ప్రకారం.. గుండాల మండలం ముత్తాపురం గ్రామానికి చెందిన చింత సత్యం, పూర్ణ దంపతులు సుమారు ఐదేళ్ల క్రితం టేకులపల్లి మండలం కుంటల్ల పంచాయతీ రామచంద్రాపురం (అందుగులగూడెం)లోని పూర్ణ స్వగ్రామానికి వలస వచ్చారు. కూలి పనులు చేసుకుంటూ జీవిస్తున్నారు. వీరికి కుమారుడు శిశాంత్(9), కుమార్తె ఉన్నారు. శిశాంత్ స్థానిక అందుగులగూడెం ప్రాథమిక పాఠశాలలో నాలుగో తరగతి చదువుతున్నాడు. సెలవులు కావడంతో శనివారం బాలుడు ఇంటి వద్ద ఆడుకుంటున్న సమయంలో చెట్ల పొదల్లో నుంచి వచ్చిన పాము కాలుపై కాటు వేసింది. కొద్ది సేపటికే తీవ్ర అస్వస్థతకు గురయ్యాడు. దీంతో తల్లిదండ్రులు సులానగర్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి తీసుకెళ్లగా, పరీక్షించిన వైద్యులు అప్పటికే మృతి చెందాడని తెలిపారు. మృతదేహాన్ని జెడ్పీ చైర్మన్ కోరం కనకయ్య, సర్పంచ్ మోకాళ్ల రమాదేవి సందర్శించి సంతాపం తెలిపారు. కుటుంబ సభ్యులను ఓదార్చారు.

రోడ్డు ప్రమాదంలో గుర్తుతెలియని వ్యక్తి...



గుర్తుతెలియని వ్యక్తి మృతదేహం

పాల్వంచరూరల్: రోడ్డు ప్రమాదంలో గుర్తుతెలియని వ్యక్తి మృతి చెందిన సంఘటన శనివారం జరిగింది. ఎస్‌ఐ శ్రీనివాస్ కథనం ప్రకారం.. మండల పరిధిలోని జగన్నాథపురం శివారు వైకుంఠధామం సమీపంలో బీసీఎం జాతీయ రహదారిపై శనివారం మధ్యాహ్నం రోడ్డు ప్రమాదంలో గుర్తుతెలియని వ్యక్తి మృతి చెందాడు. మృతుడి వయసు 30 నుంచి 40 ఏళ్ల మధ్య ఉంటుందని, కుడి చేతికి స్టీల్ కడియం, హనుమాన్ బొమ్మ లాకెట్ ఉందని, నలుపు గీతలు కలిగిన తెల్లచొక్కా ధరించి ఉన్నాడని ఎస్‌ఐ తెలిపారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టామని పేర్కొన్నారు.

యువకుడిని రక్షించిన గజ ఈతగాళ్లు

భద్రాచలంఅర్బన్: భద్రాచలం వద్ద శనివారం ఓ యువకుడు గోదావరి నదిలో స్నానానికి దిగి గల్లంతుకాగా గత ఈతగాళ్లు గుర్తించి రక్షించారు. యువకుడిని కాపాడిన వారిలో కరుకు ప్రసాద్, కరుకు రాజు, రాజమండ్రి సాయి ఉన్నారు.

చెరువులో దూకి వివాహిత ఆత్మహత్య

సత్తుపల్లిరూరల్: సత్తుపల్లి మండలంలోని బేతుపల్లి చెరువులో దూకి ఓ వివాహిత ఆత్మహత్య చేసుకుంది. సత్తుపల్లికి చెందిన భారతీదేవి మనవరాలైన మల్లారెడ్డి జ్యోతి (26)కి తల్లిదండ్రులు లేరు. ఆమెకు పశ్చిమగోదావరి జిల్లా ఆకివీడు మండలం అప్పారావుపేట గ్రామానికి చెందిన సురేశ్‌తో కొన్నేళ్ల క్రితం వివాహం జరిగింది. వేసవి సెలవుల్లో భాగంగా ఇటీవల సత్తుపల్లిలోని అమ్మమ్మ ఇంటికి పిల్లలతో కలిసి వచ్చింది. ఇంతలో ఏం జరిగిందో తెలియదు కానీ శనివారం బేతుపల్లి చెరువులో దూకి ఆత్మహత్య చేసుకుంది. అటుగా వెళ్తున్న వారు జ్యోతి మృతదేహాన్ని తేలడాన్ని గుర్తించి పోలీసులకు సమాచారం ఇవ్వగా వారు చేరుకుని మృతదేహాన్ని ప్రభుత్వాస్పత్రికి తరలించారు. జ్యోతి ఆత్మహత్యకు కారణాలు తెలియకపోగా, ఘటనపై ఫిర్యాదు అందలేదని ఎస్‌ఐ బి.రాము తెలిపారు.

మూడు మోటార్ సైకిళ్లు దగ్ధం

ఖమ్మంరూరల్: మండలంలోని ఇందిరమ్మ కాలనీకి చెందిన ముగ్గురి ద్విచక్ర వాహనాలను శనివారం తెల్లవారుజామున గుర్తుతెలియని వ్యక్తులు పెట్రోల్ పోసి దగ్ధం చేశారు. కాలనీకి చెందిన బానోతు కృష్ణ మోహన్, బానోతు అనిల్ తమ మూడు వాహనాలను ఇంటి ముందు పార్క్ చేసి నిద్రించారు. తెల్లారేసరికి మూడు వాహనాలు పూర్తిగా దగ్ధం కావడంతో ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేశామని ఎస్‌ఐ వెంకటకృష్ణ తెలిపారు.

క్లుప్తంగా

చల్లసముద్రం కార్యదర్శి డీపీఓ కార్యాలయానికి అటాచ్

ఇల్లెందురూరల్: మండలంలోని చల్లసముద్రం గ్రామపంచాయతీ కార్యదర్శి వంశీకృష్ణను జిల్లా పంచాయతీ కార్యాలయానికి అటాచ్ చేస్తూ కలెక్టర్ అనుదీప్ శనివారం ఉత్తర్వులు జారీ చేశారు. బూర్గంపాడు మండలం ముసలిమడుగు గ్రామపంచాయతీ పరిధిలో 2019 నుంచి 2021 వరకు చేపట్టిన వివిధ అభివృద్ధి పనులకు సంబంధించి రూ.3,36,402 విలువైన 16 చెక్కులను అప్పటి పంచాయతీ కార్యదర్శి ఎస్‌కే రేష్మాబేగం నిబంధనలకు విరుద్ధంగా ఇల్లెందు మండలం చల్లసముద్రం గ్రామపంచాయతీ కార్యదర్శి వంశీకృష్ణ వ్యక్తిగత ఖాతాకు మళ్లించారు. ఈ విషయం వెలుగుచూడటంతో ఇద్దరు గ్రామపంచాయతీ కార్యదర్శులకు జిల్లా పంచాయతీ అధికారి షోకాజ్ నోటీసులు జారీ చేశారు. కాగా పూర్తిస్థాయి విచారణ నివేదిక వచ్చేవరకు వంశీకృష్ణను అటాచ్ చేస్తూ కలెక్టర్ ఉత్తర్వులు జారీ చేసినట్లు ఇల్లెందు ఎంపీడీఓ బాలరాజు శనివారం తెలిపారు.

మహిళ ఆత్మహత్య

అన్నపురెడ్డిపల్లి: ఉరి వేసుకుని ఆత్మహత్యకు యత్నించిన మహిళ చికిత్స పొందుతూ శుక్రవారం రాత్రి మృతి చెందింది. పోలీసులు, కుటుంబ సభ్యుల కథనం ప్రకారం... మండల పరిధిలోని కంపగూడెం గ్రామానికి చెందిన రమాదేవి(32)కి, పెంట్లం గ్రామానికి చెందిన మడివి కామేష్‌తో 16 ఏళ్ల క్రితం వివాహం జరిగింది. వీరికి ఇద్దరు పిల్లలు ఉన్నారు. కొంతకాలంగా రమాదేవి మరో వ్యక్తితో వివాహేతర సంబంధం కొనసాగిస్తుందనే నెపంతో ఇద్దరి మధ్య తరచుగా గొడవలు జరుగుతున్నాయి. గొడవల కారణంగా భార్య తన తల్లిగారి ఇంటి వద్ద ఉంటోంది. ఈ క్రమంలో వివాహేతర సంబంధంపై కుల పెద్దల సమక్షంలో పంచాయితీ నిర్వహించి మందలించారు. దీంతో మనస్తాపం చెందిన ఆమె ఈ నెల 18న ఇంటి పరిసరాల్లో చెట్టుకు ఉరి వేసుకుని ఆత్మహత్యకు యత్నించింది. గమనించిన కుటుంబ సభ్యులు కొత్తగూడెం ప్రభుత్వ ఆస్పత్రికి తరలించి, చికిత్స అందిస్తుండగా శుక్రవారం రాత్రి మృతి చెందింది. మృతురాలి భర్త ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

చేతబడి నెపంతో దాడి

అశ్వాపురం: మండల పరిధిలోని గొందిగూడెం కొత్తూరు గ్రామ పంచాయతీ మారుమూల వల స ఆదివాసీ గ్రామమైన గుండ్లమడుగు గ్రామంలో చేతబడి చేస్తున్నాడనే అనుమానంతో శుక్రవారం రాత్రి ఓ వ్యక్తి, అతని కుటుంబసభ్యులపై గ్రామానికి చెందిన కొందరు దాడి చేశారు. ఈ ఘటనపై శనివారం అశ్వాపురం పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదైంది. గ్రామానికి చెందిన మడివి లక్ష్మయ్య కుటుంబసభ్యులను అదే గ్రామానికి చెందిన మడివి జగ్గు, సోడె దినేష్, మడివి లక్ష్మయ్య, మడివి భద్రు, మడివి భీమ, మడివి నరేష్ ఆరుగురు వ్యక్తులు అసభ్య పదజాలంతో దుర్భాషలాడుతూ దాడి చేశారు. బాధితుడు మడివి లక్ష్మయ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ జితేందర్ తెలిపారు.

విద్యుదాఘాతంతో రెండు గేదెలు మృతి

చంద్రుగొండ: మండల పరిధిలోని తిప్పనపల్లి గ్రామ శివారులో గాలిదుమారానికి తెగిపడ్డ తీగలకు తగిలి విద్యుదాఘాతంతో రెండు పాడి గేదెలు మృతి చెందాయి. శుక్రవారం మేతకు వెళ్లిన గేదెలు తిరిగిరాకపోవడంతో శనివారం వెతకగా గ్రామశివారులో మృతి చెంది ఉన్నాయి. రూ.లక్ష నష్టం జరిగిందని, విద్యుత్‌శాఖ అధికారులు ప రిహారం చెల్లించాలని బాధిత రైతులు రామిశెట్టి నాగేశ్వరరావు, రామిశెట్టి రామారావు కోరుతున్నారు.

కానిస్టేబుల్‌పై కేసు నమోదు

అశ్వాపురం: అదనపు కట్నం కోసం వేధిస్తున్న సీఆర్‌పీఎఫ్ కానిస్టేబుల్, అతని కుటుంబ సభ్యులపై శనివారం పోలీసులు కేసు నమోదు చేశారు. పోలీసుల కథనం ప్రకారం.. మండల పరిధిలోని బీజీకొత్తూరు గ్రామానికి చెందిన నక్కా నవ్యశ్రీని భర్త నక్కా శ్రీను, అత్త వెంకటనరసమ్మ, మరిది కిషోర్ అదనపు కట్నం కోసం మానసికంగా, శారీరకంగా వేధిస్తున్నారు. బాధితురాలి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు ఎస్‌ఐ జితేందర్ తెలిపారు.

అంబులెన్స్ డ్రైవర్‌పై...

పాల్వంచరూరల్: ఎద్దును ఢీ కొన్న ప్రైవేట్ అంబులెన్స్ డ్రైవర్‌పై పోలీసులు శనివారం కేసు నమోదు చేశారు. మండల పరిధిలోని జగన్నాథపురం గ్రామానికి చెందిన జాటోతు రామకోటి ఈ నెల 4న పశువులను ఇంటికి తోలుకొస్తున్నాడు. ఈ క్రమంలో జాతీయ రహదారిపై పాల్వంచ నుంచి మణుగూరు వైపు వెళ్తున్న ప్రైవేట్ ఆస్పత్రి అంబులెన్స్ ఎద్దును ఢీకొనడంతో గాయపడింది. చికిత్స పొందుతున్న ఎద్దు ఈ నెల 6న మృతి చెందింది. బాధిత రైతు ఫిర్యాదు మేరకు అంబులెన్స్ డ్రైవర్ శ్రీకాంత్‌పై కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ శ్రీనివాస్ తెలిపారు.

గంజాయి పట్టివేత

కొత్తగూడెంఅర్బన్: ఖమ్మం ఎన్‌ఫోర్స్‌మెంట్ సీఐ సర్వేశ్వర్ ఆధ్వర్యాన లక్ష్మీదేవిపల్లిలోని లోతువాగు దగ్గర శనివారం చేపట్టిన తనిఖీల్లో ఐదు కేజీల గంజాయి పట్టుబడింది. ఈ సందర్భంగా ద్విచక్ర వాహనంపై ఒడిశా నుంచి ఖమ్మంకు గంజాయి తరలిస్తున్న తాళ్లూరి కృష్ణార్జున్‌ను అరెస్ట్ చేశారు. తనిఖీల్లో ఎన్‌ఫోర్స్‌మెంట్ ఎస్సై ముబషీర్, అహ్మద్, సిబ్బంది కరీం, బాలు, హరీష్, హన్మంతరావు, వెంకటేష్, సుధీర్ పాల్గొన్నారు.

క్లుప్తంగా...


వేమూరు నుంచి కొల్లూరు వరకు పాద యాత్ర చేస్తున్న మంత్రి మేరుగు నాగార్జున

చంద్రబాబు వ్యాఖ్యలపై నిరసనల వెల్లువ

కావలి/వేమూరు/ఏర్పేడు/చీపురుపల్లి: పేదలకు స్థలాలు, ఇళ్ల ఇస్తుంటే ఓర్వలేని చంద్రబాబు పేదల ద్రోహిగా మారి వారిపై అక్కసు వెళ్లగక్కుతున్నారంటూ వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు రాష్ట్రంలో పలుచోట్ల శనివారం నిరసన కార్యక్రమాలు చేపట్టారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పేదలకు సెంటు స్థలం ఇచ్చి, ఇళ్లు నిర్మించి ఇస్తుంటే చూసి ఓర్వలేని చంద్రబాబు సెంటు స్థలంలో సమాధులు కట్టుకోవాలా అంటూ అహంకారపూరితంగా మాట్లాడుతున్నాడని నాయకులు ఈ సందర్భంగా మండిపడ్డారు. బాపట్ల జిల్లా వేమూరులో సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి మేరుగు నాగార్జున ఆధ్వర్యంలో బస్టాండ్ సెంటర్ నుంచి కొల్లూరు అనంత భోగేశ్వరస్వామి ఆలయం వరకు పేదలు, వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు శనివారం పాదయాత్ర జరిపారు. పేదలకు ప్రభుత్వం మంజూరు చేసిన ఇళ్ల స్థలాలు, ఇళ్లపై అపహేళన చేస్తూ మాట్లాడిన చంద్రబాబుపై కేసు నమోదు చేసి తక్షణం అరెస్ట్ చేయాలని కోరుతూ విజయనగరం జిల్లా చీపురుపల్లి పోలీస్ స్టేషన్‌లో వైఎస్సార్‌సీపీ నాయకులు, ఇళ్ల లబ్ధిదారులు శనివారం ఫిర్యాదు చేశారు.

ఏపీ బ్రాండ్ ఇమేజ్‌ను దెబ్బ తీస్తున్న చంద్రబాబు

మంత్రి గుడివాడ అమర్‌నాథ్

దొండపర్తి (విశాఖ దక్షిణ): ఎన్నికల్లో ప్రజలు ఓడించారన్న అక్కసుతో చంద్రబాబునాయుడు రాష్ట్ర బ్రాండ్ ఇమేజ్‌ను దెబ్బ తీస్తున్నారని ఏపీ పరిశ్రమల శాఖ మంత్రి గుడివాడ అమర్‌నాథ్ ఆరోపించారు. రాష్ట్రం అన్ని విధాలా బాగు పడుతుంటే చూడలేని చంద్రబాబు.. పిచ్చి ప్రేలాపనలతో ప్రజలను తప్పుదోవ పట్టిస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. శనివారం ఆయన విశాఖ ప్రభుత్వ అతిథి గృహంలో జరిగిన మీడియా సమావేశంలో మాట్లాడారు. రాష్ట్రం మీద, ఓడించిన ప్రజల మీద, ఉత్తరాంధ్రపై.. ముఖ్యంగా విశాఖపట్నంపై చంద్రబాబు ఎందుకంత పగబట్టారో సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు.

తండ్రి హంతకులకు అండదండలా?

వివాదాస్పదంగా మారిన సునీత వైఖరి

జైల్లో ఉన్న ప్రధాన నిందితుడు ఎర్ర గంగిరెడ్డిని కలిసేందుకు తాజాగా యత్నం

- వివేకా హంతకుడు దస్తగిరి బెయిల్ రద్దు పిటిషన్‌ను వ్యతిరేకించిన సునీత
- వాస్తవాలు వెల్లడించకుండా కట్టడి చేసేందుకే సునీత తాపత్రయం
- తన భర్త, బావ పాత్ర బయటపడకుండా ఉంచాలన్నదే లక్ష్యం

సాక్షి, అమరావతి: వైఎస్ వివేకానందరెడ్డి హత్య కేసులో ఆయన కుమార్తె సునీత తీరు మరోసారి వివాదాస్పదమైంది. తండ్రిని హత్యచేసిన వారికి శిక్షలు పడేందుకు పోరాడుతున్నానని చెబుతున్న ఆమె వ్యవహారశైలి మాత్రం అందుకు పూర్తి భిన్నంగా ఉండటం అనేకానేక సందేహాలు లేవనెత్తుతోంది. వివేకాను హత్యచేశానని స్వయంగా ఒప్పుకున్న దస్తగిరికి ఆమె పూర్తి అండదండలు అందిస్తుండటం తెలిసిందే. మరోవైపు.. వివేకా హత్యకేసులో ప్రధాన నిందితుడు ఎర్ర గంగిరెడ్డిని హైదరాబాద్‌లోని చంచల్‌గూడ జైలులో కలిసేందుకు సునీత శుక్రవారం ప్రయత్నించడం ఇప్పుడు తీవ్ర చర్చనీయాంశంగా మారింది. దస్తగిరి బెయిల్ వ్యవహారంలో సునీత వ్యవహారశైలి.. అనంతరం ఎర్ర గంగిరెడ్డిని కలిసేందుకు ఆమె యత్నించడానికి సంబంధం ఉన్నట్లుగా స్పష్టమవుతోంది. తన తండ్రి హత్య కేసులో ప్రధాన నిందితులను ప్రభావితం చేయడం ద్వారా ఈ కేసు దర్యాప్తును పక్కదారి పట్టించేందుకు ఆమె యత్నిస్తున్నట్లుగా స్పష్టమవుతోంది. అసలు వివేకా రెండో వివాహంతో ఆ కుటుంబంలో తలెత్తిన విభేదాలు ఆయన హత్యకు దారితీసి ఉండొచ్చన్న బలమైన ఆరోపణలకు సునీత ప్రస్తుత వ్యవహారశైలి బలం చేకూరుస్తోంది.

హంతకుడు దస్తగిరికి సునీత అండదండలు..

సాధారణంగా తండ్రిని హత్యచేసిన వారిపై ఎవరికైనా ఆగ్రహం ఉంటుంది. కానీ, వైఎస్ వివేకానంద రెడ్డిని స్వయంగా హత్యచేశానని ఒప్పుకున్న దస్తగిరిపై ఆయన కుమార్తె సునీత అంతులేని సానుకూలత ప్రదర్శిస్తున్నారు. సీబీఐ దస్తగిరిని అప్రూవర్‌గా మార్చడాన్ని ఆమె ఏమాత్రం వ్యతిరేకించలేదు. అనంతరం.. బెయిల్ కోసం దస్తగిరి పిటిషన్ వేస్తే సీబీఐ అభ్యంతరం వ్యక్తంచేయలేదు. అంతేకాదు.. సునీత కూడా అతని బెయిల్ పిటిషన్‌ను వ్యతిరేకించలేదు. మరోవైపు.. అసలు హత్యచేసిన దస్తగిరిని అప్రూవర్‌గా మార్చడాన్ని వివేకా పీఏ కృష్ణారెడ్డి న్యాయస్థానంలో సవాల్ చేశారు. అతనికి ఇచ్చిన బెయిల్‌ను రద్దుచేయాలని కూడా కోర్టును కోరారు. కానీ, సునీత వెంటనే ఈ కేసులో ఇంప్లీడ్ పిటిషన్ దాఖలు చేయడం విస్మయపరిచింది. అలాగే, దస్తగిరి బెయిల్‌ను రద్దుచేయాల్సిన అవసరంలేదని ఆమె న్యాయస్థానికి తెలపడం గమనార్హం. అంతేకాదు.. ఈ కేసుకు సంబంధించి కృష్ణారెడ్డికి ఎలాంటి అర్హతలేదని.. బాధితురాలిగా తనకే అది ఉందని ఆమె వాదించారు. దస్తగిరి బెయిల్‌పై బయట ఉండటంపట్ల తనకేమాత్రం అభ్యంతరంలేదని చెప్పుకొచ్చారు. అసలు తన తండ్రిని హత్యచేసిన వ్యక్తి జైలులో ఉండాలని కోరుకోవాల్సిన సునీత.. అతను బయట ఉండాలని ఆశిస్తుండటం వెనుక ఏదో మతలబు ఉందన్నది స్పష్టమవుతోంది.

దస్తగిరి వాంగ్మూలాన్ని బలపర్చాలనే..

నిజానికి.. దస్తగిరి అప్రూవర్‌గా ఇచ్చిన వాంగ్మూలంలో పేర్కొన్న అంశాలతో ఎర్ర గంగిరెడ్డి విభేదించారు. సీబీఐ నమోదు చేసిన దస్తగిరి అప్రూవర్ వాంగ్మూలంలో చెప్పినవన్నీ అవాస్తవాలని ఆయన చెప్పారు. దాంతో దస్తగిరి అప్రూవర్‌గా ఇచ్చిన వాంగ్మూలం అంతా కట్టుకథేనని తేలిపోయింది. ఈ నేపథ్యంలో.. ఎర్ర గంగిరెడ్డిని కలిసి దస్తగిరి అప్రూవర్‌గా ఇచ్చిన వాంగ్మూలంలోని అంశాలను బలపరచాలని ఒత్తిడి చేయడమే సునీత ఉద్దేశంగా తెలుస్తోంది. అందుకోసం ఎర్ర గంగిరెడ్డిని ప్రలోభాలకు గురిచేయడం.. ఆయన బెయిల్‌కు సీబీఐ సహకరించేట్లుగా చేస్తానని హామీ ఇవ్వడం ఆమె ప్రణాళికగా ఉంది. వివేకా హత్య అనంతరం అక్కడ ఆధారాలను ధ్వంసం చేయాలని ఎర్ర గంగిరెడ్డిని సునీత భర్త నర్రెడ్డి రాజశేఖరరెడ్డి, బావ శివప్రకాశ్‌రెడ్డి ఆదేశించారు. ఇదే అంశం సునీత, ఆమె భర్తకు ప్రతికూలంగా మారింది. ఈ విషయంలో మాట మార్చాలని.. ఆధారాల ధ్వంసంతో తన భర్తకు సంబంధంలేదని ఎర్ర గంగిరెడ్డితో చెప్పించాలన్నది సునీత ఉద్దేశం. తాను చెప్పినట్లు చేస్తే ఎర్ర గంగిరెడ్డికి బెయిల్ వచ్చేందుకు సహకరిస్తామని ఆమె హామీ ఇచ్చేందుకు యత్నించినట్లు తెలిసింది.

ఎర్ర గంగిరెడ్డిని కలిసే ప్రయత్నం ఎందుకో!?

ఇక వైఎస్ వివేకానందరెడ్డి హత్య కేసులో ప్రధాన నిందితుడుగా ఉన్న ఎర్ర గంగిరెడ్డిని జైల్లో కలిసేందుకు సునీత ప్రయత్నించడం ఇప్పుడు విస్మయపరుస్తోంది. గంగిరెడ్డిని కలిసేందుకు ఆమె జైలు అధికారులను అనుమతి కోరగా వారు నిరాకరించారు. దాంతో ఆమె తన న్యాయవాది ద్వారా కొన్ని పత్రాలు ఆయన వద్దకు పంపి సంతకాలు తీసుకున్నట్లు సమాచారం. అసలు తన తండ్రి హత్య కేసులో ఏ-1గా ఉన్న గంగిరెడ్డిని సునీత కలిసేందుకు యత్నించడం సందేహాస్పదంగా మారింది. సుప్రీంకోర్టు బెయిల్ రద్దుచేయడంతో ఎర్ర గంగిరెడ్డి పోలీసుల ముందు లొంగిపోయి ప్రస్తుతం జైలులో ఉన్నారు. తాను చెప్పినట్లుగా చెబితే దస్తగిరికి సహకరించినట్లుగానే ఎర్ర గంగిరెడ్డికి సహకరిస్తామని ఆయనకు చెప్పేందుకే సునీత ప్రయత్నించినట్లు సమాచారం.

వేళ్లన్నీ సునీత, ఆమె భర్తవైపే..

ఈ మొత్తం పరిణామాలతో వివేకా హత్యకేసు దర్యాప్తును ప్రభావితం చేసేందుకు సునీత ప్రయత్నిస్తున్నారన్నది స్పష్టమైంది. ఆమె ఎందుకు హంతకులకు కొమ్ముకాస్తూ మరీ హత్య కేసు దర్యాప్తు దారి మళ్లించేందుకు యత్నిస్తున్నారన్నది కీలక ప్రశ్నగా మారింది. ఎందుకంటే.. వివేకా రెండో వివాహంతో ఆ కుటుంబంలో ఆస్తి, రాజకీయ వారసత్వ విభేదాలు తలెత్తాయన్నది బహిర్గతమైంది. ఈ నేపథ్యంలో.. వివేకా హత్యకు గురికావడంతో ఆయన సొంత కుటుంబ సభ్యులపై సందేహాలు వ్యక్తమయ్యాయి. వివేకా హత్య తరువాత ఆయన రాసిన లేఖ, సెల్‌ఫోన్లను పోలీసులకు వెంటనే ఇవ్వకుండా గోప్యంగా ఉంచమని పీఏ కృష్ణారెడ్డితో సునీత, ఆమె భర్త నర్రెడ్డి రాజశేఖరరెడ్డి చెప్పారు. ఇదే అంశంపై సీబీఐ ఇటీవల వారిని విచారించింది కూడా. నర్రెడ్డి శివప్రకాశ్‌రెడ్డి ఆదేశాలతోనే వివేకా హత్య స్థలంలో ఆధారాల ధ్వంసం చేశారన్నది వెల్లడైంది కూడా. వివేకా రాజకీయ ప్రత్యర్థులైన టీడీపీ నేత బీటెక్ రవి, అప్పటి టీడీపీ ప్రభుత్వంలో మంత్రి ఆదినారాయణరెడ్డితో సునీత భర్త నర్రెడ్డి రాజశేఖరరెడ్డి, బావగారు శివప్రకాశ్‌రెడ్డి అత్యంత సన్నిహితంగా ఉంటున్నారన్నది కూడా బహిరంగ రహస్యంగా మారింది.

వాస్తవాలు వెల్లడి కాకూడదనే..

ఈ నేపథ్యంలో.. వివేకా హత్య కేసులో సునీత భర్త నర్రెడ్డి రాజశేఖరరెడ్డి, బావ శివప్రకాశ్‌రెడ్డిల పాత్ర ఉందనే వాదన బలపడుతోంది. అంటే ఈ కేసులో వారిని నిందితులుగానే భావించాల్సిన పరిస్థితి ఏర్పడింది. కాబట్టి తాము బాధితులమని.. తమకే అర్హత ఉందని చెప్పేందుకు వారు నైతిక హక్కు కోల్పోయారు. మరోవైపు.. ఎర్ర గంగిరెడ్డి సీబీఐ ముందు నిజాలు వెల్లడిస్తే తమ కుటుంబానికి ఇబ్బందిగా మారుతుందని సునీత ఆందోళన చెందుతున్నారు. అందుకే వాస్తవాలు వెల్లడించకుండా కట్టడి చేసేందుకే ఎర్ర గంగిరెడ్డిని కలిసేందుకు సునీత యత్నించినట్లు స్పష్టమవుతోంది.

శ్రీవారి ఆర్జిత సేవలు, వీఐపీ దర్శనాల్లో స్వల్ప మార్పులు

తిరుమల: వేసవి సెలవుల కారణంగా తిరుమలలో భక్తుల రద్దీ రోజురోజుకూ అనూహ్యంగా పెరుగుతోంది. సర్వదర్శనం భక్తులకు దాదాపు 30 నుంచి 40 గంటల సమయం పడుతోంది. శుక్ర, శని, ఆదివారాల్లో భక్తులు వేచి ఉండే సమయం ఇంకా ఎక్కువగా ఉంటోంది. ఈ నేపథ్యంలో సామాన్య భక్తుల సౌలభ్యం కోసం జూన్ 30వ తేదీ వరకు స్వామి వారి సేవలు, వీఐపీ దర్శనాల్లో స్వల్ప మార్పులు చేస్తున్నట్లు టీటీడీ చైర్మన్ వైవీ సుబ్బారెడ్డి శనివారం ఒక ప్రకటన విడుదల చేశారు. శుక్ర, శని, ఆదివారాల్లో సుప్రభాత సేవకు విచక్షణ కోటాను రద్దు చేశారు. తద్వారా 20 నిమిషాల సమయం ఆదా అవుతుంది. గురువారం తిరుప్పావడ సేవ ఏకాంతంగా నిర్వహించనున్నారు. తద్వారా 30 నిమిషాల సమయం ఆదా అవుతుంది. శుక్ర, శని, ఆదివారాల్లో వీఐపీ దర్శనాలకు సిఫార్సు లేఖలు స్వీకరించరు. స్వయంగా వచ్చే వీఐపీలకు మాత్రమే బ్రేక్ దర్శనం కల్పించడం జరుగుతుంది. తద్వారా ప్రతిరోజు మూడు గంటల సమయం ఆదా అవుతుంది. క్యూలైన్లలో గంటల తరబడి కిలోమీటర్ల మేర వేచి ఉండే వేలాది మంది సామాన్య భక్తులకు ఈ నిర్ణయాల వల్ల త్వరితగతిన స్వామివారి దర్శనం లభిస్తుంది.

24న రూ.300 ప్రత్యేక ప్రవేశ దర్శన టికెట్ల కోటా విడుదల

తిరుమలలో రూ.300 ప్రత్యేక ప్రవేశ దర్శన టికెట్లకు సంబంధించిన జూలై, ఆగస్టు నెలల కోటాను ఈ నెల 24న ఉదయం 10 గంటలకు టీటీడీ ఆన్‌లైన్‌లో విడుదల చేయనుంది. భక్తులు ఈ విషయాన్ని గమనించి టీటీడీ వెబ్‌సైట్ https://tirupatibalaji.ap.gov.in లో దర్శన టికెట్లు బుక్ చేసుకోవాలని టీటీడీ కోరుతోంది.

శ్రీశైల మహాకుంభాభిషేకం వాయిదా

కార్తీకమాసంలో నిర్వహించాలని నిర్ణయం

సాక్షి, అమరావతి: శ్రీశైల మహాక్షేత్రంలో ఈ నెల 25 నుంచి 31వ తేదీ వరకు నిర్వహించ తలపెట్టిన మహాకుంభాభిషేకం కార్యక్రమాన్ని వాయిదా వేసినట్లు దేవదాయ శాఖ కమిషనర్ శ్రీరాము సత్యనారాయణ తెలిపారు. వేసవి వడ గాలుల దృష్ట్యా శ్రీశైల మహాక్షేత్రంలో నిర్వహించవలసిన మహాకుంభాభిషేకం కార్యక్రమాన్ని పండితులతో సంప్రదించిన పిమ్మట, వారి సూచనల మేరకు పవిత్రమైన కార్తీకమాసంలో నిర్వహించాలని నిర్ణయించినట్లు పేర్కొన్నారు.

ఈ మార్పును భక్తులు గమనించాలని సూచించారు. ఈ విషయమై జ్యోతిష్య పండితుల ద్వారా ముహూర్తం నిర్ణయించి త్వరలో తేదీని ప్రకటిస్తామని దేవదాయ శాఖ కమిషనర్ వివరించారు.

ఆందోళనకరంగానే అవినాశ్‌రెడ్డి తల్లి ఆరోగ్యం

కర్నూలు (హాస్పిటల్): కడప ఎంపీ అవినాశ్‌రెడ్డి మాతృమూర్తి శ్రీలక్ష్మి ఆరోగ్యం ఇంకా విషమంగానే ఉన్నట్టు వైద్యులు తెలిపారు. శుక్రవారం ఉదయం పులివెందులలోని ఇంట్లో ఆమెకు గుండెనొప్పి రావడంతో కళ్లు తిరిగి కిందపడిపోయారు. వెంటనే స్థానిక ఆస్పత్రిలో ప్రాథమిక చికిత్స చేయించి మెరుగైన వైద్యం కోసం కర్నూలు తరలించారు. స్థానిక విశ్వభారతి హాస్పిటల్‌లో ఈసీజీ, 2డీ ఎకో, అవసరమైన రక్త పరీక్షలు నిర్వహించారు. ఈసీజీలో మార్పులతో పాటు కార్డియాక్ ఎంజైమ్స్ పెరగడం, బీపీలో మార్పులు ఉండటంతో ఐసీయూలో ఉంచి చికిత్స అందిస్తున్నారు. శనివారం సైతం శ్రీలక్ష్మికి ఈసీజీ, 2డీ ఎకో నిర్వహించిన అనంతరం యాంజియోగ్రామ్ పరీక్షలు చేశారు. ఇందులో రెండు వాల్వ్‌లు బ్లాక్ అయినట్టు గుర్తించామని కార్డియాలజిస్ట్ డాక్టర్ హితేష్‌రెడ్డి తెలిపారు. ట్రోపోనిన్ పెరగడంతో గుండెపోటు వచ్చే అవకాశం ఎక్కువగా ఉందన్నారు. అందువల్ల కొన్నిరోజుల పాటు ఐసీయూలోనే చికిత్స అందించాల్సి ఉన్నట్టు చెప్పారు. ఆమెకు మెరుగైన వైద్యం అందించేందుకు ప్రత్యేక వైద్యుల బృందం కృషి చేస్తోంది. కాగా, శ్రీలక్ష్మికి అందుతున్న వైద్యసేవలను ఎంపీ అవినాష్‌రెడ్డి దగ్గరుండి చూసుకుంటున్నారు.

ఈనెల 22న విచారణకు హాజరుకండి

ఎంపీ అవినాశ్‌రెడ్డికి సీబీఐ నోటీసులు!

సాక్షి, హైదరాబాద్: మాజీ మంత్రి వివేకానందరెడ్డి హత్య కేసు దర్యాప్తులో భాగంగా ఎంపీ అవినాశ్‌రెడ్డికి సీబీఐ అధికారులు మరోమారు నోటీసులు జారీ చేశారు. ఈనెల 22న కోఠిలోని సీబీఐ కార్యాలయంలో విచారణకు హాజరుకావాలని అవినాశ్‌రెడ్డికి నోటీసులు జారీ చేసినట్టు తెలిసింది. శుక్రవారం సీబీఐ విచారణకు హాజరుకావాలని గతంలో సీబీఐ అధికారులు నోటీసులు జారీ చేశారు. అయితే, తన తల్లి శ్రీలక్ష్మి అస్వస్థతకు గురవడంతో దర్యాప్తునకు హాజరుకాలేనని ఎంపీ అవినాశ్‌రెడ్డి తన న్యాయవాదుల ద్వారా సీబీఐ అధికారులకు లిఖిత పూర్వకంగా సమాచారం అందించారు. దీంతో మారోమారు విచారణకు హాజరు కావాలని ఆయనకు నోటీసులు జారీ చేశారు.

జిల్లా వార్తలు

వన సంరక్షణ కోరుతూ సైకిల్ యాత్ర


పాలకృష్ణతో గ్రీన్ భద్రాద్రి సభ్యులు

భద్రాచలంఅర్బన్: వన సంరక్షణ కోరుతూ ఓ వృద్ధుడు సైకిల్ యాత్ర చేపట్టాడు. కర్ణాటక రాష్ట్రంలోని రాయచూరు జిల్లా సింధనూరుకు చెందిన చాత్రాజుల విజయ గోపాలకృష్ణ దేశ శాంతి, జల, జంతు, వన సంరక్షణ కోరుతూ గత ఏడాది మార్చి 11న సైకిల్ యాత్ర ప్రారంభించాడు. ఇప్పటివరకు ఘనాపూర్, తుల్జాపూర్, షిర్డీ, నాసిక్, త్రయంబకేశ్వరం, గుజరాత్ తదితర ప్రాంతాల్లో పర్యటిస్తూ శనివారం భద్రాచలం చేరుకున్నారు. ఈ మార్గంలో ప్రజలకు శాంతి, వన సంరక్షణపై అవగాహన కల్పిస్తూ ఛత్తీస్‌గఢ్, ఒడిశా మీదుగా బుద్ధగయ వెళ్తానని గోపాలకృష్ణ తెలిపారు. కాగా, ఆయనను గ్రీన్ భద్రాద్రి అధ్యక్షుడు కామిశెట్టి కృష్ణార్జున్‌రావు, ఉపాధ్యక్షుడు బెల్లంకొండ రాంబాబు తదితరులు కలిసి మాట్లాడారు.

బోధనేతర సిబ్బంది నియామకానికి కసరత్తు


ఉద్యోగులకు సూచనలిస్తున్న ఏపీఓ డేవిడ్‌రాజ్

భద్రాచలంఅర్బన్: ఉమ్మడి ఖమ్మం జిల్లాలోని తెలంగాణ గిరిజన గురుకుల ఏకలవ్య మోడల్ రెసిడెన్షియల్ పాఠశాలల్లో బోధనేతర సిబ్బంది పోస్టుల కోసం దరఖాస్తుల స్వీకరణ, పరిశీలన కొనసాగుతోంది. ఈ మేరకు భద్రాచలంలోని ఐటీడీఏ కార్యాలయ ఉద్యోగులు దరఖాస్తులను పరిశీలిస్తుండగా, శనివారం ఐటీడీఏ ఏపీఓ (జనరల్), గురుకులాల ఇన్‌చార్జ్ ఆర్‌సీఓ డేవిడ్‌రాజు పలు సూచనలు చేశారు. దరఖాస్తులను నిశితంగా పరిశీలిస్తూ, ఏమైనా లోటుపాట్లు ఉంటే సరిచేయించాకే స్వీకరించాలని తెలిపారు. కార్యక్రమంలో ములకలపల్లి ప్రిన్సిపాల్ రాజేశ్, ఉద్యోగులు కృష్ణార్జున్‌రావు, నరేందర్, విజయలక్ష్మి, పాపారావు తదితరులు పాల్గొన్నారు.

రూ.2 వేల నోట్లతో బారులు

- బ్యాంకుల్లో క్యూకట్టిన ప్రజలు
- బ్యాంకులతో పాటు ఏటీఎం యంత్రాల్లో డిపాజిట్
- ఇప్పటికే నిరాకరిస్తున్న పలు వ్యాపార సంస్థలు


ఖమ్మంలోని ఓ ఏటీఎంలో నోట్లు డిపాజిట్ చేస్తున్న వినియోగదారులు

ఖమ్మంవ్యవసాయం: పెద్దనోట్లను మార్చుకునేందుకు జిల్లావాసులు బ్యాంకులు, ఏటీఎంల బాట పట్టారు. రూ.2 వేల నోట్లను చెలామణి నుంచి ఉపసంహరించుకుంటున్నట్లు ఆర్‌బీఐ శుక్రవారం ప్రకటించగా.. నోట్లు కలిగిన వారు బ్యాంక్ ఖాతాల్లో జమ చేసుకోవడంతో పాటు మార్చుకునేందుకు అవకాశం కల్పించింది. ఈ నెల 23 నుంచి సెప్టెంబర్ 30వ తేదీ వరకు బ్యాంకుల్లో డిపాజిట్ చేసుకోవచ్చని ప్రకటించినప్పటికీ శనివారం కూడా బ్యాంకర్లు స్వీకరించారు. అలాగే, ఏటీఎంల్లోని డిపాజిట్ మిషన్లలో కూడా డిపాజిట్‌కు అవకాశం ఉండడంతో పలువురు క్యూ కట్టారు.

బ్యాంకు ఖాతాల్లో జమ..

ఆర్బీఐ ఉపసంహరించుకున్న రూ.2 వేల నోట్లు కలిగిన వారు ఈ నెల 23 నుంచి పరిస్థితి ఎలా ఉంటుందోనన్న భావనతో శనివారమే బ్యాంకులకు వచ్చి ఆరా తీయడం కనిపించింది. ఏటీఎం యంత్రాల్లో నేరుగా కొందరు జమ చేస్తుండగా, మరికొందరు బ్యాంకుల్లో నేరుగా డిపాజిట్ చేశారు. ఖమ్మం జిల్లా కేంద్రంలోని పలు బ్యాంకుల్లో పరిశీలించగా రూ.2 వేల నోట్ల డిపాజిట్‌కు వచ్చిన వారే ఎక్కువగా కనిపించారు.

నిరాకరిస్తున్న వ్యాపార సంస్థలు

రూ.2 వేల నోట్లను ఉపసంహరించుకుంటున్నట్లు ఆర్‌బీఐ నుంచి ప్రకటన వెలువడగానే పలు వ్యాపార సంస్థల బాధ్యులు ఆ నోట్లు తీసుకునేందుకు వెనకడుగు వేస్తున్నారు. మళ్లీ తామైనా బ్యాంకుల్లో జమ చేయాల్సిందేనన్న భావనతో వారు తీసుకోవడం లేదు. బ్యాంకులకు వెళ్లలేని పలువురు వ్యాపారులను సంప్రదిస్తే నిరాకరించడంతో మళ్లీ బ్యాంకులు లేదంటే ఏటీఎంలను ఆశ్రయించక తప్పడంలేదు.

ఖాతాలో డిపాజిట్ చేశారు..



వ్యాపారంలో భాగంగా వచ్చిన రూ.2 వేల నోట్లను బ్యాంకులో డిపాజిట్ చేశా. కొంత కాలంగా ఈ నోట్లపై అనుమానాలు ఉన్నాయి. నోట్లు రద్దవుతాయనే ప్రచారం కూడా సాగింది. క్రమంగా నోట్ల వినియోగం బాగా తగ్గిపోయింది. ఇంతలో నోట్లు రద్దు చేయడంతో నా వద్ద అన్ని నోట్లను డిపాజిట్ చేశా.

–సోమారపు సుధీర్‌కుమార్, అడ్తి వ్యాపారి, ఖమ్మం

ఏటీఎంలో జమ చేసుకున్నా..



పెద్ద నోట్లు కదా అని రూ.2000 నోట్లు 16 దగ్గర పెట్టుకున్నాను. ఆర్బీఐ ఆ నోట్లను ఉపసంహరించుకుంటున్నట్లు ప్రకటించటంతో కంగారు పడ్డా. కానీ ఖాతాలో డిపాజిట్ చేసుకునే అవకాశం కల్పించడంతో మనసు కుదుట పడింది. దీంతో ఏటీఎంకు వెళ్లి డిపాజిట్ మిషన్ ద్వారా ఖాతాలో జమ చేసుకున్నా.

–ఎం.ఆరోగ్యరాజ్, నాయుడుపేట, ఖమ్మం

అత్యవసరంగా ఉపయోగపడతాయని..



పెద్ద నోట్లు కదా అత్యవసర సమయంలో ఉపయోగపడతాయని దాచిపెట్టుకున్నాం. ఆర్బీఐ చేసిన ప్రకటనతో అయోమయానికి గురైనా ప్రత్యామ్నాయాన్ని చూపించడంతో నోట్లు జమ చేసేందుకు వచ్చాం. పది నోట్ల వరకే అవకాశం ఇవ్వటంతో కుటుంబంలోని అందరి ఖాతాల్లో నగదును జమ చేస్తున్నాం.

–చింతాల దినేశ్, పెద్దతండా, ఖమ్మం

వేగ జ్యూయెలరీలో ఎగ్జిబిషన్, ఆఫర్లు


భిన్నమైన డిజైన్లలోని ఆభరణాలతో ఉద్యోగులు

ఖమ్మంగాంధీచౌక్: విజయవాడ, హైదరాబాద్‌లోని వేగ జ్యూయెలరీలో వెడ్డింగ్ జ్యూయెలరీ ఎగ్జిబిషన్ ఏర్పాటు చేయడమే కాక పలు ఆఫర్లు ప్రకటించారు. ఈ సందర్భంగా సంస్థ ప్రతినిధులు వనమా నవీన్, వనమా సుధాకర్ మాట్లాడుతూ వేడుకలు, వివాహాలకు కావాల్సిన కొత్త మోడళ్లలోని ఆభరణాలను ఈ ప్రదర్శనలో అందుబాటులో ఉంచామని తెలిపారు. అలాగే, బంగారు ఆభరణాల తయారీపై 50 శాతం తగ్గింపు, డైమండ్ జ్యూయెలరీ క్యారెట్ రూ.56 వేలుగా ఆఫర్ ప్రకటించినట్లు చెప్పారు. ప్రముఖ డిజైనర్లు రూపొందించిన ఆభరణాల ప్రదర్శన, అమ్మకాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

తిరుమలలో మంత్రి పువ్వాడ


తిరుమల ఆలయం వద్ద మంత్రి పువ్వాడ, కుటుంబ సభ్యులు

ఖమ్మంమయూరిసెంటర్: రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్ కుటుంబ సమేతంగా శనివారం తిరుమలలో శ్రీ వెంకటేశ్వరస్వామిని దర్శించుకున్నారు. దర్శనానంతరం రంగనాయకుల మండపంలో మంత్రికి వేదపండితులు ఆశీర్వచనం అందించగా, టీటీడీ ఆలయ అధికారులు తీర్థప్రసాదాలు, పట్టు వస్త్రాలను అందజేశారు. ఈ సందర్భంగా మంత్రి పువ్వాడ మాట్లాడుతూ తెలుగు రాష్ట్రాలు ప్రగతిపథంలో నడవాలని స్వామివారిని వేడుకున్నట్లు తెలిపారు.

జాతీయ మైనార్టీ కమిషన్ ఎదుట హాజరైన సీఐ


సీఐని వివరాలు అడిగి తెలుసుకుంటున్న సభ్యురాలు షహజాదీ

ఖమ్మంమయూరిసెంటర్: బీజేపీ నాయకులపై నమోదు చేసిన కేసుల అంశంపై జాతీయ మైనార్టీ కమిషన్‌కు అందిన ఫిర్యాదుతో శనివారం విచారణ చేపట్టారు. హైదరాబాద్‌లో జాతీయ మైనార్టీ కమిషన్ సభ్యురాలు షహజాదీ విచారణ చేపట్టగా, ఖమ్మం టూటౌన్ సీఐ శ్రీధర్ హాజరయ్యారు. ఇటీవల కలెక్టర్ దిష్టిబొమ్మ దహనం చేసిన ఘటనలో అక్కడ లేని బీజేపీ జిల్లా అధ్యక్షుడు గల్లా సత్యనారాయణ, మరికొందరిపై కేసులు ఎందుకు నమోదు చేశారని ఆమె ప్రశ్నించినట్లు సమాచారం. అలాగే, రెండేళ్లుగా జెడ్పీ సర్కిల్‌లో ఏయే రాజకీయ పార్టీల నాయకులు ఎవరెవరి దిష్టిబొమ్మలు దహనం చేశారు? ఎందరిపై కేసులు నమోదు చేశారనే సమాచారంతో పోలీస్ కమిషనర్ విష్ణు ఎస్.వారియర్‌ను ఢిల్లీలో తమ ఎదుట హాజరుకావాలని సూచించినట్లు తెలిసింది. కాగా, విచారణకు ఖమ్మం టూటౌన్ సీఐ శ్రీధర్‌తోపాటు బీజేపీ మైనార్టీ సెల్ జిల్లా అధ్యక్షుడు షేక్ యాకూబ్‌పాషా, నాయకులు షేక్ షర్ఫుద్దీన్ తదితరులు హాజరయ్యారు.

జాతీయస్థాయి ఖో–ఖో పోటీలకు ఎంపిక


కాయం కిరణ్


కల్తీ అన్వేశ్


ఈసం వసంతరావు

కల్లూరు: గిరిజన జాతీయ ఖేల్ మహోత్సవం సందర్భంగా ఇటీవల నిర్వహించిన ఎంపిక పోటీల్లో భద్రాద్రి కొత్తగూడెం జిల్లా నుంచి ముగ్గురు ఖో–ఖో క్రీడాకారులు ఉమ్మడి జిల్లా తరఫున పాల్గొని ప్రతిభ కనబరిచారు. వారిని జాతీయస్థాయి పోటీల్లో పాల్గొనే రాష్ట్ర జట్టుకు ఎంపిక చేసినట్లు ఖో–ఖో అసోసియేషన్ జిల్లా ప్రధాన కార్యదర్శి పసుపులేటి వీరరాఘవయ్య తెలిపారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా టేకులపల్లి మండలం టెక్రాన్‌చిలకకు చెందిన ఈసం వసంతరావు, గుండాల మండలం దామరతోగుకు చెందిన కల్తీ అన్వేశ్, ఇల్లెందు మండలం సుదిమళ్లకు చెందిన కాయం కిరణ్‌కుమార్ జూన్ 9వ తేదీ నుంచి ఒడిశాలో జరిగే జాతీయస్థాయి క్రీడా పోటీల్లో పాల్గొంటారని వెల్లడించారు. క్రీడాకారులను ఖో–ఖో అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు జంగా రాఘవరెడ్డి, ఎస్.కృష్ణమూర్తి, ఖమ్మం జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు పి.రామయ్య, వీరరాఘవయ్యతో పాటు శ్రీహరి, పి.నరసయ్య, ఎస్.రామారావు, ఎ.కృష్ణ, పవన్‌కుమార్, ప్రసాద్ శనివారం అభినందించారు.

జాబ్‌మేళాకు ఏర్పాట్లు పూర్తి

- నేడు ఖమ్మం ఎస్‌బీఐటీలో పోలీస్ శాఖ ఆధ్వర్యాన నిర్వహణ
- ఏర్పాట్లను పరిశీలించిన సీపీ వారియర్


ఏర్పాట్లను పరిశీలిస్తున్న సీపీ వారియర్, అధికారులు

ఖమ్మంక్రైం: పోలీస్ శాఖ ఆధ్వర్యంలో ఆదివారం ఖమ్మంలోని ఎస్‌బీఐటీలో నిర్వహించనున్న జాబ్‌మేళాకు ఏర్పాట్లు పూర్తయ్యాయి. జాబ్‌మేళాకు ఉమ్మడి ఖమ్మం జిల్లా నుంచి దాదాపు 15 వేల మంది నిరుద్యోగ యువత హాజరవుతారనే అంచనాతో ఏర్పాట్లు చేస్తున్నారు. కాగా, కళాశాలలను పోలీస్ కమిషనర్ విష్ణు ఎస్.వారియర్ శనివారం పరిశీలించి సూచనలు చేశారు. నిరుద్యోగ యువతకు ఉపాధి కల్పించే దిశగా ప్రముఖ కంపెనీలను ఒప్పించి జాబ్ మేళా నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఎస్సెస్సీ, ఇంటర్, ఐటీఐ, డిగ్రీ, పీజీ, ఫార్మసీ, బీటెక్, ఎంటెక్, ఎంబీఏ, ఎంసీఏ విద్యార్హత కలిగిన దాదాపు 8 వేల మందికి ఉద్యోగావకాశాలు దక్కుతాయని భావిస్తున్నట్లు చెప్పారు. శాంతిభద్రతల పరిరక్షణకు మాత్రమే పరిమితం కాకుండా కమ్యూనిటీ పోలీసింగ్‌లో భాగంగా జాబ్‌మేళా ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో అడిషనల్ డీసీపీ సుభాష్ చంద్రబోస్, ఏసీపీలు గణేశ్, ప్రసన్నకుమార్, రామోజీ రమేశ్, ఎస్‌బీఐటీ కాలేజీ చైర్మన్ కృష్ణ పాల్గొన్నారు.